SOME PAGES IN THE ORIGINAL CONTAIN FLAWS AND OTHER DEFECTS WHICH APPEAR ON THE FILM

Digitized in 2006
by
Thrinaina Informatics Ltd, Secunderabad, A.P., India.
(http://www.thrinaina.com)

From the original owned by
Sundarayya Vignana Kendram
and its partner Institutions

as part of the
British Library Endangered Archives Programme
supported by the
Lisbet Rausing Charitable Fund

Except for individual research purpose
any reproduction should be made with
written permission from the

Sundarayya Vignana Kendram,
1-8-1/B/25/A, Bagh Lingampally, Hyderabad - 500 044
Andhra Pradesh, India

COPYRIGHT STATEMENT

The copyright laws of the United States (Title 17, United States Code) and of India (Copyright Act of 1957) govern the making of photocopies or other reproductions of copyrighted material including foreign works under certain conditions. In addition, the United States extends protection to foreign works by means of various international conventions, bilateral agreements, and proclamations.

Under certain conditions specified in the laws, libraries and archives are authorized to furnish a photocopy or other reproduction. One of these specified conditions is that photocopy or reproduction is not to be used for any purpose other than private study, scholarship, or research. If a user makes a request for, or later uses, a photocopy or reproduction for purposes in excess of "fair use," that user may be liable for copyright infringement.

These institutions reserve the right to refuse to accept a copy order if, in their judgment, fulfillment of the order would involve violation of the copyright laws of the United States or India.

సుబ్బారాయ, వావిలికొలను, 1863-1936

సావిత్రీ చరిత్రము

చెన్నపురి, 1916

Record no. 680

Subbārāya, Vāvilikolanu, 1863-1936

Sāvitrī caritramu

Cennapuri, 1916

Record no. 680

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

సుబ్బారాయు, వావిలికొలను, 1863-1936.
సావిత్రీ చరిత్రము / వావిలికొలను సుబ్బారాయ విరచితము.- 2. కూర్పు.-
చెన్నపురి : సదానంద నిలయ ముద్రాక్షరశాల, 1916.
(2), 170 p., (10) leaves of plates : ill. ;13 cm.
Record no. 680

Subbārāya, Vāvilikolanu, 1863-1936.
Sāvitrī caritramu / Vāvilikolanu Subbārāya viracitamu.- 2. kūrpu.-
Cennapuri : Sadānanda nilaya Mudrākṣaraśāla, 1916.
(2), 170 p., (10) leaves of plates : ill. ;13 cm.
Record no. 680

35mm microfilm

Image placement: IA (IIA) IB IIB   Date filming began: 22 January 2006

ARYA CHARITRA SERIES
No. 6

సావిత్రీ చరిత్రము.

రావికొలను సుబ్బరాయ రచితము

CALICO
0-4-6

SILK
CALICO
0-5-6

Roja Muthiah Research Library
3rd Cross Road, C P T Campus,
Taramani, Chennai - 600 113, India.

Maximum light given.

శ్రీరామ.

ఆర్యచరిత్రరత్నావళి.

నాలుగవ రత్నము.

సావిత్రీచరిత్రము.

వావిలికొలను సుబ్బరాయ

విరచితము.

రెండవకూర్పు.

9380

చెన్నపురి:
సదానందనిలయముద్రాక్షరశాలయందు
ముద్రింపఁబడియె.

Copy-right Reserved.

దాతారం సర్వసంపదామ్

ఆపదా మపహర్తారం

లోకాభిరామం శ్రీరామం

భూయో భూయో నమామ్యహమ్.

క. నీపాదకమలసేవయు
నీపాదార్చకులతోడి నెయ్యమునునితాం
తాపార భూతదయయును
దాపసమందార నాకు దయసేయఁగదే.

జనకుఁడు.

తండ్రి పిల్లవాండ్రకు ఆర్యచరిత్రములు చెప్పట.

శ్రీపద్మావతిదేవి.

ఈ గ్రంథములను రచియించు నుద్దేశ
మును తెలిసిన తోడనే యుదార చిత్తులై
తమ "సువర్ణమాలిక" (Suvarnamala)
యందు మనోహరముగ చిత్రకళాధురంధ
రులగు ధురంధరులవారిచే (Mr. Durandhar) వ్రాయఁబడి ప్రకటింపఁబడుచున్న
చిత్రముల నీగ్రంథముల ముద్రించు స్వా
తంత్ర్యమును మాకొసంగిన బొంబాయి
పురస్థ "లక్ష్మీచిత్రముద్రాకార్యాలయము"
(Lakshmi Art Printing Works) వారికిఁ
గృతజ్ఞతా పూర్వక నమస్కారము లర్పిం
చుచున్నారము.

విషయసూచిక.

పుట.

సావిత్రీ సత్యవంతుల వివాహము. . . .	42
సావిత్రి గురుశుశ్రూష చేయుట.	50
సావిత్రి త్రిరాత్రోపవాస వ్రతము సలుపుట.	58
సావిత్రీ సత్యవంతులు వనమునకుఁ బోవుట. .	62
సత్యవంతుని మరణము.	82
యముఁడు సత్యవంతుని గొనిపోవవచ్చుట. .	84
సావిత్రి యమునివెంట నంటుట.	88
సత్యవంతుఁడు మరల బ్రదుకుట.	104
సావిత్రీ సత్యవంతులు మరల నాశ్రమమునకు వచ్చుట.	119
సత్యవంతుని తల్లిదండ్రులు పరితపించుట. .	120
ద్యుమత్సేనుఁడు మరల రాజగుట. . . .	132

శ్రీరామాయనమః.

ఆర్యచరిత్రరత్నావళి.

నాలుగవరత్నము.

సావిత్రీచరిత్రము.

పూర్వము పాండవులు వనవాసము చేయుచుండఁ మార్కండేయుఁడను మహాముని వారియొద్దకు వచ్చెను. అప్పుడు పాండవులందు జ్యేష్ఠుఁడగు ధర్మరాజు శాస్త్రమునఁ జెప్పినచొప్పున నాయనకు నర్ఘ్యము పాద్యము నిచ్చి సత్కరించి కుశల

ప్రశ్నానంతరము తాము దాయాదులచే పడిన పాటుల నెల్ల ఉగ్గడించి యిట్లనియె. మునీంద్రా! రాజ్యమును కోలుపోయిట మునికాని, వనములందు కష్ట మనుభవింప వలసివచ్చెఁ గదా యని కాని నేను దుఃఖింపను. అబలయు, సుకుమారియు, రాజకుమారియు నైన యీద్రౌపది మాకై యిన్నికష్టము లనుభవింపవలసి వచ్చెఁ గదా యని విషాదపడుచున్నాను. ఈ సాధ్వివలననే కదా మేము దాస్యమునుండి విడివడితిమి. అంతియగాక యీవనములందును క్లేశములనుండి యీసుచరిత్రవలననే తరించుచున్నాము.

ఇట్లు పెనిమిటులను ఆపదలనుండి రక్షించిన పుణ్యశీలిని మఱియెవ్వతె యైన

లోకమునఁ గలదా? యని యడిగిన మార్కండేయుఁ డిట్లనియె.

ధర్మరాజా! మహాపుణ్యాత్ము లయిన పురుషులయు మహాతపస్సంపన్ను లయిన మునీశ్వరులయు మాహాత్మ్య మిట్టిది యని చెప్పవచ్చును గాని పతివ్రతల మాహాత్మ్య మిట్టిదని వర్ణింపఁ దరముగాదు. దానములచేతను, తపములచేతను, ధర్మములచేతను, మానవులకును దేవతలకును సాధ్యము కానికార్యములు అబలలు తమపాతివ్రత్యము చేతనే చేయఁ గలుగుదురు. దీని కొక్క దృష్టాంతము చెప్పెదను వినుము.

నేను తొలుత అల్పాయుస్సుకలవాఁడనైన పుట్టి యిట్టిదట్టిదనరాని నిగొప్పతపస్సు

చేయుచుంటిని. ఇట్లుండ పదునాఱవయేఁట నేను శివపూజ చేయుచుండుసమయమున యముఁడు నన్ను కొనిపోవ వచ్చి నాపై పాశమును వైచెను. నేను ఆయన పాశమునుండి తప్పించుకొనలేక భయపడి శివలింగమును కౌఁగిలించుకొంటిని. యముఁడు ఆలోచనలేనివాఁడై లింగముమీఁదను నామీఁదను కూడ పాశము వైచెను. అప్పుడు లింగమునుండి రుద్రుఁడు శూలహస్తుఁడై వెలువడి యముని తన్ని నన్ను విడిపించెను. ఈవిధముగ ఈశ్వరకృపచే చావు దప్పి బ్రతికితిని గాని నాశక్తిసామర్థ్యముల చేతఁ గాదు. ఇది లోకమునకంతయు తెలిసినవిషయమే కదా. ఇఁక నొకరాచకన్నె పుట్టినది మొదలు సుకుమా

రియై ఆటలపాటల కాలము పుచ్చుచునుండినది వివాహమైన యొకసంవత్సరమునకు భర్తమరణింపఁగా యముని మెప్పించి తనపతిని బ్రతికించుకొనెను. ఒకసంవత్సరకాలములో ఆచిన్నది యెంతమహిమను సంపాదించెనో కంటివా? అనిన మునీశ్వరా! నాకాపతివ్రతచరిత్రము విన కుతూహల మగుచున్నది. వినిపింపుమా యని వేఁడిన మార్కండేయుఁ డిట్లు వక్కాణింపఁ దొడఁగెను.

అశ్వపతి యనునృపాలుఁడు మద్రదేశమును పరిపాలించుచుండెను. ఆయన పరమధార్మికుఁడు, బ్రహ్మణ్యుఁడు, మహాత్ముఁడు, సత్యసంధుఁడు, జితేంద్రియుఁడు, అనేకయజ్ఞములు చేసినవాఁడు, దానపతి యని

పేరొందినవాఁడు, ఎట్టికార్యమందును దక్షుఁడు, పౌరజానపదప్రియుఁడు, సర్వభూత హితరతుఁడు, మిక్కిలి యోర్పుగల వాఁడు. ఇట్లుండియు సంతానము లేని చింతచే చాలఁగాలము తపించి తుదకు తీవ్రనియమము వహించి బ్రహ్మచారియై జితేంద్రియుఁడై దినమున కొకసారి రెండు రెండున్నరగంటవేళకు మితముగ భుజించి లక్షమార్లు సావిత్రీ ఋక్కులచేత సావిత్రీ దేవినిఁ గూర్చి హోమము చేయుచు నిట్లు పదునెనిమిది సంవత్సరములు గడపెను.

రుక్మిణి—అప్పా! లక్ష్మీదేవి, పార్వతీదేవి, సరస్వతీదేవి, అనఁగా విన్నాను. సావిత్రీ దేవి యెవ్వరు?

తండ్రి—భగవంతుఁడు తన తేజస్సునందలి యల్పభాగముచేతనే యీ ప్రపంచము నంతయు సృష్టించును, రక్షించును, లయము నొందించును. సంధ్యవార్చునపుడు ఈ దివ్య తేజస్సే ధ్యానింపఁబడును. ఈ తేజస్సునే ఉదయమున గాయత్రియని, మధ్యాహ్నమున సావిత్రియని, సాయంకాలమున సరస్వతియని, ద్విజులు ధ్యానించి జపించి యాకర్షించి దీర్ఘాయువు, ఆరోగ్యము, బలము గలిగి సుఖింతురు.

ఈవిధముగా ఆ రాజు పదునెనిమిది సంవత్సరములు సావిత్రీ దేవినిఁ గూర్చి హోమము చేయఁగా పదునెనిమిదవ సంవత్సరము కడపట ఆ మహాదేవి ఆకారముతోఁ

గూడినదై అగ్నిహోత్రమునుండి సంతో
షముచే వికాసము నొందిన మోముఁ
దామరతో బయలుదేరి వచ్చి రాజును
చూచి యిట్లనెను. "నృపాలా! నీభక్తికి,
శ్రద్ధకు, యమనియమములకు, బ్రహ్మచర్య
మునకు తుష్టిచెందితిని. ధర్మమందు ప్ర
మాదపడక యేమి కోరెదవో కోరుము"
అనెను. ఆమాటలు విని "దేవీ! నేను
ధర్మార్థముగానే కోరుచున్నాను. పుత్రులు
లేకున్న పుట్టగతులు లేవు. సంతానమే
పరమధర్మమని పెద్దలు వచింతురు. కా
వున నాకు కులముద్ధరించుకొడుకులు పె
క్కురు పుట్టవరమిమ్ము." అని హస్తములు
జోడించి వేడుకొనెను.

అతని వాక్యములు విని సావిత్రీదేవి

"భూపతీ! నీకొక కూఁతురు పుట్టఁ గలదు."
అనెను. రాజు మిక్కిలి విషాదము నొం
దినవాఁడై "తల్లీ! నేను కొడుకులకొఱకై
తపించితిని. కొడుకు మేలుగాక కూఁతు
రేల? ఆనందకందమగు నందనుఁ డెక్కడ?
దుఃఖకందమగు కూఁతురెక్కడ? కావున
నాయందు దయయుంచి పుత్రు ననుగ్ర
హింపుము" అని సాఁగిలఁబడి మ్రొక్కె
ను. సావిత్రీదేవియును అతని లెమ్మని
చెప్పి "భూపాలా! నీలోని కోరిక నేను
మున్నే యెఱిఁగి యీవిషయమై బ్రహ్మ
దేవుని ప్రశ్నించితిని. ఇప్పటికొకపుత్రి
కను మాత్ర మనుగ్రహింపుము అని
ఆయన చెప్పెను. కావున తేజోవతియగు
కూఁతురు నీకు శీఘ్రకాలమందే కలుగు

గును. ప్రతిభాషింపకుము. ఇది బ్రహ్మ నియోగము. దాఁటరానిది" అని చెప్పి యంతర్హిత యయ్యెను.

రుక్మిణి — కొందఱు బిడ్డలు బిడ్డలు అని కలవరించి నోములు నోఁచి, వ్రతములు చలిపి, యాత్రలుచేసి బాధపడెదరే యేల? బిడ్డలు లేకుండిన నష్టమేమి?

తండ్రి—ఈప్రశ్నకు ప్రత్యుత్తరము నీవు పెద్దదాన వైనపుడు నీకే తెలియఁగలదు. అయినను బిడ్డలు లేరని లోకులు విచార పడుటకు, సుతులు లేని వారికి గతులు లేవని శాస్త్రములు చెప్పుటకు కారణములు ఇప్పటికి మీరెంతమాత్రము గ్రహింపఁగలరో అం

తమాత్రము తెలిపెదను. స్త్రీలును పురుషులును అందఱు తాము ముసలివారయి కూడ జీవింతు మని తలఁచుచుందురు గాని యౌవనదశయందే మరణింతు మని తలఁపరు. అట్లు ముసలివారైనపుడు యౌవనమందు వారికుండిన జవసత్త్వము లుండవు గనుక తమ్ము విచారించి సుఖముగ రక్షించువా రుండవలయు నని వారు కోరుచుందురు. తమకడుపునఁ బుట్టి తాము రక్షింపఁగా పెరిగి తమద్రవ్యము తినువారికంటె నితరులు తమ్ము ప్రీతితో చూతురా? చూడరు గనుక బిడ్డలు కావలయునని లోకులు కోరుచుందురు. ముసలితనపుమాటయటుండ బిడ్డలను

లాలించుచు బేలించుచు, నవ్వించుచు, వారి జిలిబిలి పలుకులు విని వారి పిల్ల చేష్టలు కని వారితోపాటు తాము ను ఆడుచు పాడుచు మనుష్యులు సంతోషింతురు. సంసారమం దింతకంటెను నిర్మలమగు నానంద మిచ్చునది మఱి యేదియు లేదు. కావున లోకు లిట్టి ఆనందమును గోరుట న్యాయ్యమే కదా? సుతులు లేకుండిన గతులు లేవనుటకు కారణము చెప్పెదను. పూర్వజన్మముల మనము చేసినపుణ్యమును పాపమును అనుభవించుటకే మరల భూమిమీద జన్మించుచున్నాము. ఈజన్మమందు మరల పుణ్యముగాని పాపముగాని చేయక పూర్వజన్మములందు చేసినవాని

నన్నింటిని దైవభక్తిచేతఁగాని, జ్ఞానము చేతఁగాని, కర్మముచేతఁగాని, మొదలు ముట్ట నశింపఁజేయక మనము మోక్షమును పొందఁజాలము. ఇట్లు చేయుటకు అందఱకు సాధ్య మగునా? కాదు. కాఁబట్టి తాను తనపూర్వపుణ్యపాపములను క్షయింపఁజేయఁగా మిగిలిన దానిని తనకుఁగాను తన యంతటివాఁడు, తనయందు ప్రీతిగలవాఁడు క్షయింపఁజేసిన తాను నరకాది బాధ లేక సుఖపడ వచ్చునని ప్రతిమనుష్యునకు తోఁచుట స్వభావమే కదా. నీవు ఒకరియొద్ద పదిరూపాయలు అప్పు తీసితి వనుకో. నీవు కొంత చెల్లించి కొంత చెల్లింప లేక పోయితివనుకో.

అప్పు ఇచ్చినవాఁడు నిన్ను బాధింపఁ
గా మఱియెవరైన వచ్చి ఆ అప్పు తీర్చి
ఆ బాధనుండి నిన్ను తొలఁగించిన నీ
వెంత సంతోషింతువు. ఆ ప్రకారమే
ప్రతిమనుష్యుఁడు భూమిమీఁద పుట్టి
నపుడే అప్పులతో పుట్టుచున్నాఁడు.
దేవ ఋణము, పితృఋణము, ఋషి
ఋణములోనైనవి తీర్పక తాను గడ
తేఱలేఁడు. వీనియందు తాను తీర్పఁ
గా మిగిలినవి తన పుత్రుఁడు తీర్చునేని
తాను కడతేఱును. తాను మరణిం
చిన పిమ్మట పుత్రుఁడు తర్పణములు
శ్రాద్ధములు శ్రద్ధతో సలిపెనేని పర
లోకమందు తనకు సుఖముగలుగును.
అట్లు శ్రాద్ధములు ప్రీతితోను శ్రద్ధ

తోను పెట్టువారు లేకున్న పరలోక
మందు దుఃఖములు తొలఁగవు. కాఁ
బట్టి సుతులు లేకుండిన గతులు లేవు.
కావుననే శాస్త్రములందు

ఆ. బ్రతికియుండఁ బనుచు పలుకులు పాటించి,
యాబ్దికముల మిగుల నన్న దాన
మొనరఁ జేసి, పిండమును గయ నిడువాఁడు
పుత్రుఁ డనెడి పేరు పొందఁగలుగు.

అని చెప్పఁబడినది.

అమ్మణి—కూఁతురేల కొడుకే కావలయు
నని రాజనెనే కూఁతురు తక్కువేమి?
కొడుకెక్కువేమి?

రాముఁడు—కొడుకు మగవాఁడు కాఁ
బట్టి యెక్కువ.

తండ్రి—గుణవంతురాలగునేని కొడుకు

కంటె కూఁతురు పదంత లెక్కువ యని శాస్త్రములు చెప్పుచున్నవి. అట్టికూఁతురు చెడిపోయెనా యది పుట్టినింటివారిని అత్తయింటివారిని అపకీర్తిలో ముంచి వర్ణసంకరము కలిగించి తాను చెడి తనమగనివంశమును చెఱిచి గొప్ప కీడు కలిగించుచున్నది. కాఁబట్టి కదా కూఁతురు పుట్టఁగానే యొక బిరుదు తెగ గోయు మని సామెత. కూఁతురు పుట్టినది మొదలు తలిదండ్రులు అనేక విచారములకు పాలుపడుచుందురు. దీనికి మగఁడెవ్వఁడగునో? దీనిమగఁడు దుష్టుఁడైన నిది యెన్ని కష్టము లనుభవింపవలసి వచ్చునో. అల్లుఁడని పేరు రాఁగానే యెట్టియధ

మునకును బిగు వెక్కువ యగును. వాఁడు గుణహీనుఁడుగ నగునేని బదులు చెప్పుటకును లేక వానిచే దీనికై యెన్ని నీచపు మాటలు పడవలయునో. ఇది దుష్టురాలై మన వంశమున కపకీర్తి మనకు పాపము మెడఁగట్టునో యని యీవిధముగ నాలోచించుచుందురు. కూఁతురు గుణవంతురాలాయెనా కీర్తి కలుగును. దౌహిత్రుల వలన పరలోక సుఖమును కలుగును.

కొడుకు నాకొడుకు కోడలు వచ్చువఱకు
కూఁతురు నాకూఁతురు ప్రాణ ముండువఱకు

అన్నట్లు కొడుకులకు తలిదండ్రులయందలి ప్రీతి భార్య రాఁగానే తొలఁగినఁ దొలఁగును గాని కూఁతురు తల్లిదండ్రులయం

దు అందు ముఖ్యముగ తల్లిమీఁద ప్రీతి పాయదు. తల్లి చచ్చిన తండ్రి పినతండ్రి యను సామెత అసత్యముగాదు. కూఁతురెప్పటికైన పరులసొత్తు గనుకను, తనభారమును వహింపఁజాలదు గనుకను అది కొడుకును గనినఁగాని తనకు గతులు లేకపోవుటచేతను తండ్రి కొడుకునే కోరును.

రుక్మిణి—నీకు బిడ్డలు లేరే నీకు పుణ్యగతులు లేవా?

తండ్రి—దీనికిఁ బ్రత్యుత్తరము తరువాతఁ జెప్పెదను.

అమ్మణ్ణి—మనుష్యుఁడు భూమిమీఁద పుట్టిన తరువాతఁగదా అప్పుచేయును? అప్పులతోనే యెట్లు పుట్టును?

తండ్రి—రెండుమూఁడు దినములతరువాత దీనికి ప్రత్యుత్తరము చెప్పెదను. ఇఁకఁ గొన్నిసంగతులు చెప్పినఁగాని నాప్రత్యుత్తరము మీకు బోధపడదు.

తరువాతి కథవినుఁడు. సావిత్రీదేవి వరమిచ్చిపోఁగానే రాజు తన నగరమునకు వచ్చి వృత్తాంత మంతయు తన భార్యకు చెప్పి సుఖముగా నుండెను. శీఘ్రకాలమునందే మాళవియను ఆయనభార్య గర్భము వహించి యొక పుణ్యదినమున నొక పుత్రికను ప్రసవించెను. అశ్వపతియును మహానందముతో పురుడుండి జాతకర్మము నామకరణములోనగునవి కావించి సావిత్రీమంత్రము జపించుటచే సావిత్రీదేవి వరమువలన జనించినది కావున ఆశిశువు

నకు సావిత్రి యని పేరు పెట్టెను. తల్లిదండ్రులు మిక్కిలి గారాబముతో పెంప దాదుల చేతులమీఁదనే శుక్లపక్షచంద్రబింబమువలె క్రమక్రమముగ పెరిఁగి వివాహమునకుఁ దగిన వయస్సు గలదాయెను. ఆకాలమందు అంతటి రూపవతి, గుణవతి, మతిమతి దేశమునందు లేకుండినను ఒక రాజకుమారుఁడైన ఆమెను వివాహమాడ నిచ్ఛగించినవాఁడు కాఁడు. ఆమె సౌందర్యము గుణాతిశయము విని వివాహమాడ వలయునను కొండంతయాశతో ఉవ్విళ్లూరు మనస్సుతో రాజకుమారులాపురమునకు వచ్చి ఆమె తేజమును చూచి నిరుత్సాహులై పోవుచుండిరి. ఇట్లు కొంతకాలము జరగఁగా నొకనాఁడు

అశ్వపతి సావిత్రిని తనయొద్దకు పిలిపించి యొడిలో కూర్చుండఁ బెట్టుకొని యిట్లనియె.

"అమ్మా! నీయందమునందును, చందమునందును, సుగుణబృందమునందును నొక్కకందుగాని కుందుగాని లేదు. అట్లున్నను ఒకరాజకుమారుఁడైన నిన్ను వివాహమాడ నిచ్ఛగించినవాఁడు లేఁడు. నీ దివ్యతేజస్సు చూచి రాచకొడుకులందఱు నీవు దేవతాస్త్రీవనియు నీకుఁ దాము తగమనియుఁ దలఁచి పోవుచున్నా రని వింటిని. నీకా పరిణయకాలము సమీపించినది. ఎన్నిదినములు జరగినను కన్యక నొకనికి నియ్యవలయునే కదా? ఎవనికనియిత్తును?

క. సుతకు వివాహ మొనర్పని
పితయును,ఋతువేళఁ దనదుప్రియఁ గూడనియా
పతియును, దండ్రిచనఁగ హిత
గతిఁ దల్లిని బ్రోవనట్టి కఠినుఁడు నింద్యుల్.

అనునట్లు నీకు వివాహము చేయకుండుట దోషమని యెఱుంగుదు.

తే. "రూపగుణశీలముల ననురూపుఁడైన
వరున కీక కన్నియఁ దనవలచినట్లు
తగనివానికి నిచ్చుట ధర్మదేవ
తాతనూభవ! బ్రహ్మహత్యాసమంబు". భార.

అని యుండుటచేఁ దగిన వరున కీయక అల్పున కిచ్చితినా నాకు బ్రహ్మహత్య వచ్చును. కులమువా రొక్కరును నిన్నుఁ గోరరైరి యేమి చేయుదును? రాజ్యాధిపతులు కానట్టి యుత్తమ క్షత్రియకుమారు

లెందరైన నున్నారేమో విచారింపవలయును. నేనొక్కమాట చెప్పెదను వినుము. కన్యకకుఁ దగిన వరుని విచారించి వివాహము చేయవలసిన భారము తల్లిదండ్రులందే యున్నదని యెఱుఁగుదును. కులము గుణము గలిగి నీకు తగినవారు నాకు గోచరింపలేదు. కావున నా భారము నీయందే యుంచుచున్నాను. నీవు తీర్థయాత్ర నెపమున దేశాటనము చేసి యందందుఁగల యుత్తమ క్షత్రియులను, సద్గుణవంతులను విచారించి వచ్చితి వేని యందు నీవు వలచిన వానికి నిన్నిచ్చి వివాహము చేసెదను. నీవు బుద్ధిమంతురాలవు. గుణవంతురాలవు. పుణ్యచరిత్రవు. నీవలన నీకును కులమునకును, స్త్రీజాతికిని,

మాకును కీర్తివచ్చునే కాని యపకీర్తి రాఁజాలదని నాకు నమ్మకము గలదు. కేవల కామధనరూపములు, నీమనస్సు నాకర్షింపఁ జాలవని నేనెఱుఁగుదును. కావున ఈ భారము నీయందుంచితిని. నీతోడ కావలసిన పరివారము సేన నంపెదను. అని యామెను తగిన పరివారముతోడ పంపెను.

ఆమెయును వృద్ధులగు సచివులతోడ రాజఋషు లుండు వనములు తీర్థములు సేవించుచు అందం దుండు పెద్దలకు నమస్కరించి వారి యాశీర్వచనములు గొనుచు తీర్థములందు యథావిధి దానములు గావించుచు తిరిగి మరల జనకునింటికి వచ్చెను. ఆమె వచ్చునప్పటికి సరిగ అశ్వపతి నారదుతోడ ముచ్చటలాడుచుండెను.

ఆమెయును మంత్రులతోడ లోనికి వచ్చి ఆయుభయుల పాదముల వ్రాలి నమస్కరించి నిలిచెను. తండ్రియు బిడ్డను చేరఁదీసి ప్రక్కన గూర్చుండఁ బెట్టుకొనెను. అప్పుడు నారదుఁ డిట్లనియె.

రాజేంద్రా! ఈకన్యక నీకూఁతురు గదా. ఈమె కేల యింకను వివాహము చేయకున్నవాఁడవు? ఈమె యెక్కడనుండి వచ్చుచున్నది? ఏమికార్యము కొఱకు ఎందు పోయి యుండెను?" అనిన రా జిట్లనియె.

చిలుక పంజరమున బంధింపఁబడుటకు దాని మధురవాక్కులే కారణమైనట్లు ఈమె యతిలోక తేజస్సే వరప్రాప్తికి విఘ్నము కలిగించుచున్నది. కిరీటాధిపతి కాఁ

గలవాఁడొక రాజకుమారుఁడైన నీమెను వరింపఁదలఁచినవాఁడు కాఁడు. కావున ఈమె గుణము తేజము నెఱిఁగినవాఁడను కావున "అమ్మా! నీవే పోయి చూచి వరుని కోరుకొనిరమ్ము. నేను వివాహము చేసెదను" అని చెప్పి తీర్థయాత్రకై పంపితిని. అందుండి యిప్పుడే వచ్చుచున్నదని చెప్పి సావిత్రిని చూచి "తల్లీ! నీవు పోయిన కార్యము సఫలమాయెఁగదా? ఏ రాజకుమారుని కోరితివో చెప్పుము. నారదమహామునులును విన వేడుకపడుచున్నారు" అనిన నాకన్యారత్న మిట్లు చెప్పెను.

"తండ్రీ! సాల్వదేశాధిపతియు, ఉత్తమక్షత్రియుఁడును, ధర్మాత్ముఁడును నయిన ద్యుమత్సేనుఁడను ప్రఖ్యాతి వహించిన పుణ్య

చరిత్రుఁడు కొంతకాలము మీఁద అంధుఁడయ్యెను. ఆయన కొమారుఁడు పసిబిడ్డఁడైయుండుటచేత పూర్వవైరులు కొందఱు దాడి వెట్టి గ్రుడ్డిరాజును బాలవత్సలయైన భార్యతోడ నూరు వెడలఁ గొట్టిరి. ఆ చీఁకురాజు ఇప్పుడు అడవియందు భార్యాపుత్రులతోడ తపము చేయుచున్నవాఁడు. నగరమునఁ బుట్టి కాననమున పెరిఁగిన యారాజకుమారుని భర్తగా వరించితిని" అని చెప్పినతోడనే నారదుఁడు నారాయణా నారాయణా పాపము శమించును గాక పాపము శమించును గాక యని తల వ్రాల్చి గ్రుక్కెడంత సేపుండి "రాజా! తెలియక నీకూఁతురు సత్యవంతుని వరించి చేయఁగూడని కార్యము చేసెను. దానికై

నేను చింతించెదను. తండ్రి సత్యము దప్పని వాఁడు తల్లియును సత్యము దప్ప నిది. కావున వారికుమారునికి సత్య వంతుఁడని విప్రులు పేరిడిరి. ఆకుమా రుఁడు చిత్రముగ గుఱ్ఱములను చేయును. కావున నతనికి చిత్రాశ్వుఁడనియు పేరు గలదు".

అశ్వపతి—మునీంద్రా! ఆరాచకొమరుఁడు తేజోవంతుఁడు బుద్ధిమంతుఁడు, క్షమా వంతుఁడు, శూరుఁడు, పితృభక్తిగల వాఁడే కదా?

నారదుఁడు—తేజస్సునను సూర్యునిబోలు ను. బుద్ధియందు బృహస్పతితో సముఁ డు. ఇంద్రునివంటి వీరుఁడు. భూమివలె నోర్పు గలవాఁడు.



నారదుఁడు సత్యవంతుని గుఱించి చెప్పుట.
S. Page 28.

అశ్వపతి— ఆ నృపనందనుండు దాతయును బ్రహ్మణ్యుఁడును, సత్యవంతుఁడును, అగును కదా? విశేషసుందరుఁడు కాకున్నను ప్రియదర్శనుఁడైన నగునుగదా?

నారదుఁడు —— యథాశక్తి దానమునందు సంకృతిపుత్రుఁడైనరంతి దేవునకు తుల్యుఁడు. శిబివలె సత్యవాదియు బ్రహ్మణ్యుఁడును. యయాతివలె నుదారుఁడు ప్రియదర్శనుఁడు. అశ్వినీ దేవతలవలె సుందరుఁడు. అంతియగాక ఇంద్రియ నిగ్రహము గలవాఁడు, మెత్తనివాఁడు, శూరుఁడు. అసూయ లేనివాఁడు. మంచి మైత్రిగలవాఁడు. హ్రీమంతుఁడు. ఆర్జవము, సత్యము, ధృతి, ఆయనయందు నిలుకడగ వసించుచున్నవి.

అశ్వపతి — దేవమునీ! కన్య నిచ్చువాఁడు వరునియం దేయేగుణములుండఁ గోరునో కులోచితమైన యన్ని సద్గుణములు సత్యవంతునియందుఁ గలవని మీరే సెలవిచ్చితిరి. ఆయనయం దేదైన చెడు గుణముండిన కరుణించి తెలుపఁ గోరెదను.

నార — ఆయనయందు గుణములనన్ని మ్రింగు నొక దోషము తప్ప మఱి యేదోషము లేదు. ఆ దోషము ప్రయత్నముచే చక్కఁబడునది కాదు. అతఁడు నేఁటికి సరిగ సంవత్సరమునాఁడు కాలపాశవశుఁడగును.

అశ్వ — తల్లీ సావిత్రీ! యీ దేవముని వాక్యములను వింటివి కదా. వీరు త్రికా

లవేదులు, అమోఘవచనులు. వీరు చెప్పినది తప్పదు. తెలిసి తెలిసి యల్పాయు వగువాని నేల కోరెదవు? మఱి యెవ్వనినైనఁ గోరుము.

సావిత్రి — తండ్రీ! సమస్త ధర్మవేదులును ధర్మనిష్ఠులును నగుమీ రిట్లు పలుకుట న్యాయ్యమా!

అశ్వ — అమ్మా! నేనేమి అధర్మవాక్యములు పల్కితిని. ఆపద రాఁగల దనుసందేహము గల విషయములందే బుద్ధిమంతులు ప్రవర్తింప రన నిఁక స్పష్టముగ కీడు వచ్చు కార్యముల నెవ్వరైనఁ జేయుదురా? లక్ష్మి చపల కావున నైశ్వర్యము శాశ్వతము కాదని తలఁచి ఆయన దరిద్రుండైనను నిన్నీయ నొప్పితిని. ఆల్లా

రు ముద్దుగ, అరచేతి నిమ్మపండువలె, నేలనడిచిన నీపాదము లఱిగి పోవునే మో యను భీతిచే చేతులమీఁదనే గోముగ పెంచిన నిన్ను నీయట్టిసుకు మారిని తపసి బాలునికి ధారవోసి నీవు నారచీరలు కట్టి, జడలు ధరించి, కందమూలములు దిని, ఉపవాసముల వటించి, ఎండకు గాలికి వానకు సంక కటపడుచు, కడుపుమాచి కూడుపెట్టి, తలఁజూచి నీళ్లు పోయువారు లేక, ఆకు గుడిసెలలో నేలమీఁద పైఁట చెఱఁగుపానుపుగా హస్తము తలదిండు గా పండుకొనుచు, అడవిమృగముల కూఁతలకు మేలుకొనుచు కష్టింపవలసి వచ్చెఁగదా యనుదుఃఖమును అతఁడు

గుణవంతుఁడు విద్యావంతుఁడు కులీ నుఁడు అని యెఱుఁగుటచేత శమించు కొన్నను ఒకయేఁడైన తిరుగకముందే కుంకుమ లేని నీమొగమును పాపట లేని నీముండలను చూడవలసివచ్చు నన్న దుఃఖము నెట్లు సహింపఁగలను?

సావిత్రి—నా పాపముచేతనే కదా నాకు వైధవ్యదుఃఖము రావలయును? అట్టి దుఃఖము నే ననుభవింపవలసిన తల వ్రాఁత యున్నయెడల నేను కోరిన వానికిఁ గాక నన్ను మీరు మఱియొక నికి నిచ్చినను వాఁడు మాత్రము నూఱేఁడులు బ్రతుకు నని యెట్లు నమ్మకము?

అశ్వ—అటులని చూచి చూచి బావిలోఁ దుముక వచ్చునా?

సావి—ముందు బావియున్నదని తెలియని యెడల ప్రమాదమునఁ దానియందుఁ బడినఁ బడుదుముగాని తెలిసినప్పుడు దానిని తప్పించిపోమా?

అశ్వ—అయ్యో పిచ్చిదానా! మృత్యు వును తప్పించుకొనఁ నెవరివశమమ్మా?

సావి—మృత్యువును దప్పించుకొనఁ జీవికి సాధ్యముకాదుగాని యిట్టిమహాత్ములు దయఁ దలఁచి రేని మృత్యువునుండి తప్పింపఁగలరు.

అశ్వ—వారు తపస్సంపన్నులు కావున తప్పింపఁగలరు.

సావిత్రి—స్త్రీలును తపస్సంపన్నలు కాఁగూడదా? అబలలపై నిట్టివారికి దయ రాఁరాదా?

అశ్వ—ఏ స్త్రీలో యయిన నీ కేమిలాభ మమ్మా? ఒక సంవత్సర కాలములో సంసార మంతయు నిర్వహించుచు నీవు తపస్సేమి చేయఁగలవు?

సావిత్రి—మునీంద్రా! స్త్రీలకు పాతివ్ర త్యముకంటెను తపస్సు కలదా?

నార—లేదు.

సావి—పతివ్రతలకు పతివియోగముకలదా?

నార—లేదు.

సావి—తండ్రీ! మీమాట కెదురు చెప్పు చున్నానని కోపగింపకుఁడు. ఈబ్రహ్మ

పుత్రుల యనుగ్రహము మనయందుఁ గలదు. నాప్రియుఁడు కాలపాశవశుఁడగు నని మాత్రము చెప్పిరి గాని నాకు పతివియోగము కలుగునని వీరు సెలవిచ్చినవారు గారు. అంతియుగాక పాపము శమించు ననియు వచించిరి. వీ రమోఘవచను లని మీరు సెలవిచ్చితిరి. ఇఁక నా కేమి భయము?

అశ్వ—అనిష్టము విన్నప్పుడు శాంతము పాపము అని పెద్ద లందురు. ఇంతటి కత్తిమీఁదిసాము నీ కేల? లోకమునందు రాజకుమారులకు కఱవా?

సావిత్రి—

క. ఒకసారి సారె వేయుట
యొకసారియె యిడితి ననుట, యొకసారియె క

న్యకనుం దానము చేయుట,
యకటా యిరుమాఱు సేయ నర్హమె వీనిన్.

క. "వినుము మనోవాక్కాయము
లన మూఁడు తెఱంగు, లందు నంతఃకరణం
బనఘ! ప్రధానము, గావున
మనమునఁ గైకొన్నభర్త మానం దగునే?" భార.

మనోవాక్కర్మములందు మొదటిదైన మనస్సు ప్రధానము. మనస్సున తలఁపఁబడినదే వాక్కుచే చెప్పఁబడును. అదియే చేతఁ జేయఁబడును. మనస్సున నొకటి యెంచి వాక్కున మఱొకటి చెప్పినను లేక చేసినను అట్టివారు లోకవంచకులే గాక ఆత్మవంచకులు నగుదురు. ఆత్మనే వంచించువారు చేయలేని పాప మేది యుం

డును? మొదట నిశ్చయించుకొనిన పతి యందు నేదో దోషము కలదని వానిని విడిచి మఱియొకనిఁ గోరి, వానియందు మఱియొక దోషము కనఁబడ వాని విడిచి మఱియొకని వలచి, వానియందు మఱియొకదోషము దోఁప మఱియొకని వరించు కాముకికి విధివిరామములు లేక వయసు చెల్లువఱకు మగలు ప్రాప్తించుచుందురు. అది యెవతె చేయవలసిన కార్యము? మనస్సున నేను నిశ్చయించినపుడే యా రాజకుమారుఁడు నాభర్త యయ్యెను. అట్టి భర్తపై నుండు మనస్సును మఱియొకనిపై నుంచుట జారిణీ లక్షణము గాని సతీలక్షణము గాదు. నీడయే లేనిదీపము,

దోషమే లేనిజీవి లోకమున లభించునా? మానవతి ఆపత్సహస్రము సహించును గాని శీలమానహాని లేశమైన సహింపదను సూక్తి వినరా?

అశ్వ—కన్యాదానమున నధికారము తండ్రికి కలదు గదా. నేను కోరినవాని కిచ్చెదను. అంగీకరింపుము.

సావిత్రి—నామనస్సు ఎవనిమీఁదను పోకముందు మీ రట్లుచేసి యుండినయెడల మీరు నియమించినపురుషుఁడే నాభర్తయని శిరసావహించి గ్రహించి యుందును.

అనిన ఆమె దృఢనిశ్చయ మెఱింగి

విచారపడుచున్న నృపునిం జూచి నారదుం డిట్లనియె.

చ. గొనము ప్రొక్క నీయనుంగుం గూఁతురు, దీనితలం
పు మాన్పఁగా మనకు నశక్య మింక, ననుమాన
ములేల? నరేంద్ర! యింతిం జయ్యన నృపసూతి
కిమ్ము, కమలాసన చేసిన పుణ్యగౌరవం బున నయి
నం బ్రియుండు పరిపూర్ణచిరాయురుపేతుం
డయ్యెడుం." భార.

రాజా! నీపుత్రికవాక్యములు ధర్మయుక్తములు. శీలవతీసూచకములు. శిష్టాచారసమ్మతములు. ఇట్టి దృఢనిశ్చయురాలి మనస్సు త్రిప్ప మనకు సాధ్యపడదు. ఈమె బుద్ధిచాతుర్యము, మనోనిశ్చయము, సతీత్వగౌరవబుద్ధి, చూడ నీమెకు ఏదోసంగు

లు పొసంగ వని తోఁచెడి. ఇట్టి సాధ్వీకి దేవత లెన్నఁడు నపకారము చేయరు. ఇంతకు బుద్ధి విధిలిఖిత మనుసరించును. లోకము స్వకర్మసూత్రగ్రథితము తప్పింపన సాధ్యము. నీవు సంకోచింపక సత్యవంతున కీబిడ్డ నిచ్చి వివాహము చేయుము. అనిన రాజు సంతోషించి మునీంద్రా! మీవాక్యములు వేదవాక్యములు. మీరు చెప్పినట్లు భగవంతునిపై భారమిడి యీకార్యమొనర్చెద నని పలికెను. నారదుండు రాజుచే వీడుకోలు వడసి యంతర్హితుం డయ్యెను. అశ్వపతియును కూఁతును దోడ్కొని దారబంధుపురోహితామాత్యపరిజనయుక్తుండై వివాహవస్తుసంభార

ములతోడ ద్యుమత్సేనుఁ డుండు కానన
మునకై పోయెను.

సావిత్రీ సత్యవంతుల వివాహము.

ఇట్లు పోయిపోయి అశ్వపతి ద్యుమత్సే
నుఁడు తపము చేయు వనము ప్రవేశించి
దూరమునందె పరివారము నిలిపి పాదచా
రియై తనతోడ ద్విజులను సావిత్రిని
నట్లు రాఁగా మెల్లన పోయి సాలవృక్షము
నీడ దర్భాసనమునఁ గూర్చుండి పుణ్యక
థాగోష్ఠినుండు చీఁకురాజును ద్యుమత్సే
నుఁ జూచి నమస్కారముఁ గావించి తన్నె
ఱిఁగించి సావిత్రిని నమస్కరింపఁ బని
చెను. ద్యుమత్సేనుఁడును మిగుల సంత
సించి అర్ఘ్యము, పాద్యము, పీఠము

నర్పించి గోవునొసఁగి కుశలప్రశ్నానంతర
ము నీరాకకుఁ గారణ మేమని యడిగిన
నశ్వపతి యిట్లనియె. "రాజోత్తమా! నేను
మహాప్రయోజన మొకటి కల్పించి నీవ
లనఁ గృతార్థుఁడఁ గాఁగోరి వచ్చితి. నేను
చిరకాలము సంతానము గానక తుదకు
సావిత్రీదేవి యనుగ్రహమున నీ కన్యకను
గంటిని. ఈమె పేరు సావిత్రి.

క. "ఈకన్నియ నాకూఁతురు
మాకులమున కెల్లఁ దప్ప; మనుజోత్తమ! నీ
వీకన్నియఁ గోడలిఁగాఁ
గైకొనుము మదీయవచన గౌరవబుద్ధిన్."

క. "నీకొడుకు సత్యవంతున
కీకన్నియ దగు నరేంద్ర! యీకన్నియకున్

నీకొడుకు వగుఁ; బనన్యగు
ణాకరుఁ డియ్యిర్వురును సమంచితమూర్తుల్."

అనిన నతనికి ద్యుమత్సేనుఁ డిట్లనియె.

అయ్యా! నీవు లోకోత్తరచరిత్రుఁడవనియు, ధర్మిష్ఠుఁడవనియుఁ గులీనుఁడవనియు, నీతోడి బాంధవము నవశ్యకర్తవ్యమనియు నెఱుంగుదును.

క. "కయ్యమునకు నెయ్యమునకు
వియ్యమునకు సమత వలయు; వేఱొకటైనన్
గయ్యము గెలువదు, నిలువదు
నెయ్యము, వియ్యంబు పొసఁగ నేరదు మొదలన్."

అనునట్లు వియ్యమునకు సమత్వము వలయును గదా. ఇక మాస్థితి మీకుం దెలియనిది కాదు.

తే. విగతరాజ్యుల మై ఘోరవిపినములకు
వచ్చి యిమ్మెయిఁ దపము మున్నవార మేము.
బాలసుకుమార యిది జనపాల! యడవి
నుండి మాతోడ నిడుమలఁ గోర్చునయ్య? భార

వనవాసమునందలి క్లేశములు నీ వూహింపఁజాలవా? పేదవారింటి కోడలగుట రాచకన్యకకుఁ బూర్వపాపఫలము గదా. అట్టి గతి నీపుత్రిక కేల? తలఁపవా? యనిన నశ్వపతి యిట్లనియె.

కలిమిలేములు కావడికుండలు. రాత్రి తెగువలఁ బగలును, పగటితెగువల రాత్రియు వచ్చునట్లు కష్టానంతరమున సుఖమును, సుఖానంతరమున దుఃఖము గలుగుట వింత కాదు. కావున

చ. కలిమియు లేమియున్ సతముగా, నవిచెందినచోఁ
జెలంగుచున్! గలఁగుచు నుండ్రు ధీరులప్రకా
రమె? లెస్సగ నింతపట్టు నేఁ| దెలియుదుఁ జెప్ప
దన్ వసుమతీవర! పిన్నయనంగనేల? రయో! కొలఁ
దియుఁగాదు; ధీరమతి గూఁతురు పేర్కొనఁజా
లుఁ బెంపునన్. భా. ర.

నాపుత్త్రికయు లోకస్థితిగతులు తెలియనిది గాదు. కులోచిత వృత్తియు శీలాసక్తియు ధర్మరక్తియుఁ గలది. వయస్సు చెల్లియు గురులఁ గొలువక జ్ఞానహీనులై, యుచితానుచితములు తెలియక స్వచ్ఛందవర్తనులైనవారు బాలలుగాని పిన్నవయస్సుననుండియు జ్ఞానవతులు ధీమతులు ధీరమతులు నగువారు బాలలు గారు. వనవాస

కష్టముల కీచిన్నది యెట్లోర్చునంటివి. కేవల కష్టమును గాని కేవల సుఖమును గాని యిచ్చునది లోకమున లేదు. ఒకవేళ సుఖమిచ్చునదే మఱియొకవేళ దుఃఖ మిచ్చును. ఒకరికి సుఖమిచ్చినదే మఱియొకనికి దుఃఖమిచ్చును. గ్రహించువారి మనస్థితిని బట్టి పదార్థములు సుఖదుఃఖకరములుగఁ దోఁచును. ఈనిశ్చయ జ్ఞానము గలవారికి రాకపోకలుగల దేదియు సుఖదుఃఖముల నియ్యఁ జాలదు. సహనము దానికి మందు. నాపుత్త్రిక కీనిశ్చయజ్ఞానము గలదు.

క. నీతోడ వియ్యమందం
జేతోగతి నాసచేసి చెచ్చెర నిట్లే

నేతెంచితి, మత్ప్రార్థన
బ్రాఁతిగఁ జేకొనక యునికి పాడియె నీకున్?, భార.

నెయ్యమున నీతోడ వియ్యమంద వచ్చిన నాతోడ నీవిట్లు పలుకుట ధర్మము గాదు. నానమస్కారము గ్రహించి నా కోరిక సఫలము చేయుము. ఆశాభంగము గావింపకుము. అన్నివిధముల నీవు నాసమానుఁడవు. నేనును నీకు సముఁడను. ఇట్టి బాంధవము నీవేల యుపేక్షించెద వనిన ద్యుమత్సేనుఁడు సంతుష్టుఁడై మిత్రమా! మన చెలిమి నేను మఱచిన వాఁడఁ గాను. నీతోడి బాంధవ మొల్లని వాఁడఁగాను. కానక కానక నీవొక కన్యకఁ గనినవార్త విన్ననాఁడే నీతోడ

వియ్యమందఁ దలఁచితిని గాని పదపడి నాకు ప్రాప్తించిన కష్టదశవలన నిరుత్సాహుఁడ నైతిని. నీ వింటికి వచ్చి బిడ్డ నిచ్చెద ననిన త్రోసివేయు నంత వెఱ్ఱిని గాను. చిరకాలేప్సితము నేఁడే నెఱవేఱును గాక. కల్యాణప్రయత్నము గావింపు మనెను. అంతట నాపొంతలఁగల ద్విజుల నెల్ల పిలిపించి యథావిధి సావిత్రీసత్యవంతులకు వివాహము నిర్వర్తింపించి వధూవరులకు వలసిన వస్త్రాభరణాదుల నిచ్చి అశ్వపతి తన వీటికి పోయెను. లోకమున సౌందర్యము సులభము. గుణార్జనము దుర్లభముగావున సత్యవంతుఁడును తనకు సర్వశుభగుణాన్విత యగు సుందరి లభిం

చుటకు మిక్కిలి యానందించి యామెకు ప్రీతికరములగు కార్యములఁ జేయుచుండెను.

సావిత్రి గురుశుశ్రూష చేయుట.

సావిత్రియు తాను గోరినమగఁడు లభించెనని సంతోషించి వినయమే సతీవ్రతమనుట మఱవక యత్తమామ మగలకే కొఱఁతయు తోఁపకుండునటులు వేళకుఁ దగినట్లు వారివారి చిత్తవృత్తు లెఱిఁగి యే పనియు చెప్పించుకొనక చేయుచుండెను. ప్రతిదినము పతికిముందుగ నిద్దురలేచును. నేను దొడ్డరాచబిడ్డను గదా పేడ యెట్లు తాఁకుదును? దాసివలె ప్రాఁచిపని యెట్లు చేయుదును? అని యేవగింపక, గర్వములే

క, మనయింటి పనులు మనకంటె నెక్కువ శ్రద్ధతో నెవరు చేయుదురని తలఁచి యిల్లంతయు కసవూడ్చి సూర్యున కెదురుగ నిలిచి పేడనీళ్లు చల్లరాదు గనుక ప్రొద్దు పుట్టకముందే గోమయము తోడి కలయంపి చల్లును. శుక్రవారము మంగళవారము ఇల్లంతయు గోమయమున నలుకును. అలికివిడిచిన కడపను గాని పాదు గడపనుగాని దాఁటరాదు కావున ధాన్యపుఁబిండితో ముగ్గులు పెట్టును. సోమరితనముచేత పాత్రములను మీఁదమాత్రము శుద్ధిచేయక వెలుపలను లోపలను చిలుముగాని పాఁచిగాని లేకుండునట్లును తానుపట్టించి రుద్దిన మన్ను, బూడిద చిం

తపండు పోవునట్లును నీటితో చక్కఁగ
కడుగును. గరగరలాడునట్లు వస్త్రములను
తానే యుదుకును. పాడు మొగమునందు
పెద్దమ్మ ప్రేలాడుచుండును గనుకను, అట్టి
మొగమును చూచినపతికి ఆయుస్సు క్షీణ
మగును గనుకను ప్రాతఃకాలకృత్యము
లెల్లఁదీర్చి యద్దమున చూచి ముఖమున
కుంకుముబొట్టు పెట్టుకొని, గురువులకు,
పతికి, లోకులకు క్షేమముగలుగ దైవప్రా
ర్థనచేసి, యత్తకు మామకు మగనికి నిద్దుర
లేవఁగానే కావలసినపదార్థముల సమర్చి,
వారు మేల్కొనిన వెంటనే వారికి నమ
స్కరించి, వారు కోరినపదార్థము లర్పించి,
భర్త తెచ్చిన నివ్వరి బియ్యమును పాకము

గావించి, యగ్ని హోత్రాదులకు దేవతా
రాధనమునకు వలసిన సాయ మొనరించి,
యతిథుల నభ్యాగతుల నాదరించి, యత్త
మామలు తమ కష్టముల మఱచునట్టును
పతి సంసారమే స్వర్గమని తలఁచునట్టును
ప్రవర్తించుచుండెను. సాయంకాలమున మ
రల వాకిట నీళ్లుచల్లి ముగ్గువేసి సంధ్య
దీపము వెలిఁగించి ప్రమిదకు కుంకుము
పెట్టి దీపలక్ష్మికి నమస్కరించును. గృహ
మునకు శ్రేయస్సునకై వీథి నడచువారి
కుపకారమునకై వాకిట దీప ముంచును.
పతి తెచ్చిన ధాన్యము కొంచెమో గొప్పో
వెంటనే రాయి యిసుక లేకుండునట్లు
చెరిగి జల్లించి చక్కపఱిచి పాత్రములలో

పదిలముగ దాచునే కాని యెచ్చటికుప్ప లచ్చట నే యుంచి యెలుకలపాలో కొక్కులపాలో చేయదు. తనకు తన తండ్రి యిచ్చిన వస్త్రములు భూషణములు అన్నియు అత్తగారికి కట్టబెట్టనిచ్చి తాను కాషాయవస్త్రముల ధరించి సతికి నుచితమైన చర్య జరించుచు పతిసుఖము తప్ప సతికి వేఱు సుఖము లేదు గావున ప్రియవాక్కులవలనను స్నేహమువలనను రహస్యోపచారములవలనను వినయమువలనను ఓర్పువలనను సావిత్రి భర్తను పరితోషపెట్టుచుండెను.

అమ్మణ్ణి— బియ్యపుం బిండి ముగ్గున కంటె ముగ్గురాళ్ల పిండిగాని సున్న

పురాళ్ల పొడి గాని తెల్లగా నుండును. అప్పటి వారికి సొగసులు తెలియవు. ధాన్యపుం బిండితో ముగ్గు పెట్టిన ఎంత నష్టము చూడు.

తండ్రి— తొలుత ఇల్లలుకుట యెట్టిదనగా నీవు పండ్లు తోముకొని ముఖము కడుగుకొనునట్టిది. ఆరోగ్యకరములై దంతములకు పటుత్వము నిచ్చు మంచి పదార్థములచే దంతములను శుద్ధి చేసికొనిన యెడల నెట్లు నోటికంపు పండ్లపాచి పండ్ల సందున నిటికి కొనిన పదార్థములు పోయి ఆరోగ్యము కలిగించునో యట్లే గోమయమున నలికిన యెడల నింటిలోని గాలిని శుభ్రప

తేచి, హానికరములైన కీటకాదులను బోఁగొట్టి ఆయింటియందుండు వారికి ఆరోగ్యమును కలిగించును. ముఖము కడుగుకొనినపిమ్మట నీవు ముఖమున నలంకారముగను శుభచిహ్నముగను బొట్టు పెట్టుకొనునటులు గృహలక్ష్మిని రంగవల్లిచే నలంకరింపవలయును. లేని యెడల పాడుపెట్టిన యింటివలె శ్రాద్ధము నాఁటి ఏటివలె నుండును. మన పెద్దలు పారమార్థికమైనబుద్ధి లేక కేవలము ఐహికబుద్ధితో నేకార్యము నే ర్పాటు చేయలేదు. ధాన్యపుఁబిండి తో ముగ్గు పెట్టినయెడల నది చీమలు లోనగు అల్పపు జంతువుల కాహా

ర మగును. అదియొక పుణ్యకార్యము కదా! బియ్యపుఁబిండిని చక్కఁగ సిద్ధము చేసిన యెడల రాతిపిండికంటె తెల్లగానే యుండును. ధాన్యపుఁబిండి ముగ్గు పెట్టిన నష్టమంటివి. మతియెంతో గతియంతే. ఇప్పుడు నీవు బుద్ధిమంతురాలవో సావిత్రి బుద్ధిమంతురాలో నీవే ఆలోచించుకో.

రుక్మిణి—ఇల్లలుకుట, ముగ్గుపెట్టుట, చెంబులు తోముటకూడఁ జెప్పవలయునా?

అమ్మణి — రుక్మిణమ్మా! అప్ప యేల యవి చెప్పినాఁడో నాకుఁ దెలియును. అమ్మ ఒకనాఁడు నన్ను ఇల్లలుకు మనెను. పేడ కంపు నేనుతాఁక నంటిని. అప్ప

ఆమాటలు వినుచుండెను. మహారాజు బిడ్డ యెట్లు ఇంటిపనులు చేసినదో చూడుఁడని మనకు బుద్ధి వచ్చుటకు చెప్పినాఁడు. కారణము లేక అప్ప ఒక మాటకూడఁ జెప్పఁడు లే.

సావిత్రి త్రిరాత్రోపవాసవ్రతము సలుపుట.

ఇన్ని కార్యములు చేయుచుండియు ఆ మహాభాగ నారదువాక్యములు మఱచినది కాదు. ఒకటి రెండు అని ప్రతిదినమును ఎంచుకొనుచుండెను. ఇట్లు కొంతకాఱఁత గా సంవత్సరము గడువఁగా నింక నాల్గవ నాఁడు భర్త మరణించునని యెఱిఁగి శ్రమము లేక మహాఫలము సిద్ధింపదని తలఁచి మూఁడు రాత్రులు శుష్కోపవాస ముండు

నొక మహావ్రతము చేయ నారంభించెను. త్రయోదశినాఁడు ఉపవాస మారంభించి పాడ్యమినాఁడు పారణము చేయునట్టి వ్రతమును భర్త దీర్ఘాయుష్కుఁడు కావలయునని కోరు మహాపతివ్రతలు చేయుదురు. సావిత్రి యీవ్రతమును చలుప నుపక్రమించుట యెఱిఁగి ద్యుమత్సేనుఁడు కోడలిని బిలిచి యిట్లనియె. అమ్మా! నీవు తొలుతనే సుకుమారివి. అందు వనవాసాయాసమున బడలియున్న దానవు. ఇట్టి నీవు ఘోరవ్రతము నారంభింప నేల? సుకరములగు నోములనేవైన నోచరాదా? యనిన సావిత్రి యిట్లనియె.

"తండ్రీ! నాకై మీరు పరితాపపడ

వలదు. ఈవ్రతమును నేను తుదముట్ట సలి
పెదఁగాని విఘ్నముల రానీయను.

క. మీరు మదీయం బగువ్రత
భారమునకు వగవ వలదు; పరమశుభంబుల్
గోరి వ్రత మేను బూనితిఁ,
గారణమును మీ కెఱుంగఁగా నగుఁ బిదపన్.

అనిన ద్యుమత్సేనుఁ డిట్లనియె.

క. పతిహితముఁ గోరి సలిపెడి
వ్రతమును విడు మనుచుఁ జెప్పరా దటు గానన్
వ్రతమును బారం బొనరిచి
యతులితశుభచయము లొందుమమ్మా పుత్రీ.

అని యాశీర్వచనరూపమున నామె
కార్యమున కనుమతించె. రేపు పతి మరణ
దిన మన నేటిరాత్రి తన నిబ్బరము నణఁ

సావిత్రి హోమముచేసి దైవప్రార్థనచేయుట.
S. Page 61.

చి వచ్చు శోకమునకు చిక్కియు స్థైర్యము
విడువక భగవంతునియందు ధ్యానయోగ
మున మనము నిలిపి యుదయము కాఁగా
కృత్యముల నెల్లఁదీర్చి బారెడు ప్రొద్దెక్కు
నప్పటికి హోమము నిర్వర్తించి యాశ్రమ
మున గల ద్విజులకును వృద్ధసువాసినుల
కును అత్తమామలకును నమస్కరించి వా
రు "అవైధవ్యమస్తు" వైధవ్యము లేకుండును
గాక యని దీవింప తథాస్తని మనస్సున
గ్రహించెను. నాలుగవనాఁడును తమకు
మాత్రము భోజనము పెట్టి తాను భోజ
నము చేయక యేకాంతమున నున్న కోడ
లిని పిలిచి ద్యుమత్సేనుఁడు "అమ్మా! నీ
వ్రతము సాంతమయ్యెఁగదా. నేఁడేల

యుపవసించెదవు? భోజనవేళ మించుచున్నదే" యనిన ఆమెయును "తండ్రీ! నేను వ్రతముచేయ సంకల్పించినపుడే యీపగట భుజింపరాదని నిశ్చయించుకొంటిని. ప్రొద్దుగ్రుంకిన భుజించెదను. క్షమింపుఁడనిన ఆయన యూరకుండెను.

సావిత్రీ సత్యవంతులు వనమునకుఁ బోవుట.

ఇట్లు సావిత్రి యత్తమామల సమాధానపఱుచుచుండ సత్యవంతుఁడు బుట్టయు గొడ్డలియుఁ గైకొని ఫలములను సమిధలను గొనితేర వనమునకు ప్రయాణమయ్యెను. అప్పుడు సావిత్రి తన పెనిమిటి కెదురుగ బోయి నిలిచి యిట్లనియె. నాథా! నే నీయాశ్రమమునకు వచ్చి నేటి

సావిత్రి వనమునకు వచ్చెదనని భర్తను బ్రార్థించుట.

S. S. Page 62.

కొకసంవత్సర మయ్యెను. ఒకనాఁడైనను మిమ్ము నెద్దియు కోరిన దానను గాను. కోరక కోరక నేఁడొక కోరిక కోర మనస్సు పుట్టెను. నన్ను చిన్నపుచ్చక నాప్రార్థన నెఱవేర్పఁ గోరెదను. అది మీకెట్టి యాయాసమునుగాని కష్టమునుగాని కలిగించు నదికాదు. మాటమాత్ర మంగీకరించిన చాలును.” అని సావిత్రి పలికిన సత్యవంతుఁడిట్లనియె. అంతటి సుకరమైన కార్యమగు నేని నీవిషయమున నేను వంచన చేయుదునా? నాశక్తికి లోపడిన దేదైన నిచ్చెదను. అడుగుము.

సావిత్రి — నేను తండ్రి యింట నున్నప్పుడు పురశృంగారమును అతఃపురశృంగార

ము నే కాని వనలక్ష్మి శృంగార మెట్టిదో యెఱుఁగను. నేఁడు మీవెంటవచ్చి దానిని చూచి యానందింపవలయునని కోరిక గలిగెను. నేను మీకెట్టిగాసియు నీయను. ఒకవస్తువైన నాకుఁ దెచ్చి యిమ్మని వేఁడను. ఊరక కానన శృంగారముఁ జూచి మరల మీతోఁడ వచ్చెదను. ఈబుట్టను గొడ్డలిని నేను మోసి తెచ్చెదను. మీరు సమిధలు సేకరించునంతలో నేనాదాపున నున్న పండ్లను పూవులను కోసి బుట్ట నించెదను. అని యెంతో దైన్యమున ప్రార్థించిన నామెను చూచి సత్యవంతుఁడు "అబలా! నీవు చిన్నవయసు బాలవు. అందు

సుకుమారివి. అందు గృహకృత్యములచే బడలిన దానవు. అందు నాలుగు దినములుగ నిద్రాహారములు లేక శుష్కించి గాసిల్లిన దానవు. ఇట్టి నీవు ముండ్లు రాలు కంపలు గల అడవిలో నెట్లు కాల్నడ రాఁగలవు? అడవిమృగములఁ జూచి భీతిల్లకుందువా? నేను వేగమ వచ్చెదను. నేఁటిరాత్రి పారణ చేసితివేని దేహమునకు కొంచెమైనను బలము వచ్చును. వలయునేని రేపు పిలుచుకొని పోయెదను.

సావిత్రి — ప్రాణనాథా! వనములఁ గల వింతలెన్నఁడును చూడమిని గదా మిమ్ము నేఁడు ప్రార్థించితిని. మీరు

ఉత్తమక్షత్రియ కులోద్భవులు. మీరు నాతోడ నుండ ఏమృగము నన్నేమి చేయఁగలదు? ఉపవాసమున కృశించి యున్నదాన నంటిరి. నడువఁగల నను ధైర్యము నాకు లేకుండిన నేనేల మీ వెంట నత్తునని బతిమాలుకొందును? నాశక్తి నే నెఱుఁగనా? ఈమాత్రము చిన్నకోరికయు నెఱవేర్ప మీకు మనసు గాదా? నేను మీవెంట వచ్చుటయు మీకంతకష్టముగను భారముగను తోఁచిన నాభాగ్య మింతయే యనుకొందును. సత్యవంతుఁ డనునామ ముంచుకొనిన మీరే నాకోరిక నెఱవేర్చెదనని చెప్పి తప్పుటకు నాదురదృ

సత్యవంతుఁడు సావిత్రికి వన వినోదములఁ జూపుట.

S. Page 70.

ష్టము కారణము గాక మఱియే కారణము ఉండఁగలదు. మీకు నే నేదియో ద్రోహము చేయని యెడల నాయందింతకఠినత్వము వహించి నన్ను చిన్నచూపునఁ జూతురా! అని పలికిన సత్యవంతుఁడు ప్రేయసీ! యీమాత్రమునకే లిట్లు పలికెదవు. ఉన్న విషయము చెప్పితిని గాని నిన్ను బిలుచుకొని పోఁగూడ దనుతలఁపునఁగాదు. నీయత్తమామలనుమతించినేని నేనవశ్యము పిలిచికొని పోయెదను. అనిన సావిత్రి యత్తమామల యొద్దకు పోయి నమస్కరించి తనమనస్సున నున్నయభిప్రాయము చెప్పెను. వారును కొన్ని

యడ్డములు చెప్పిరిగాని అన్నిటికిని ఆమె సమాధానములు చెప్పెను. వారును సంతోషించి "మనకోడలు మన యింటికి వచ్చినది మొద లోకకోరిక యైనను కోరినదికాదు. కావున ఆమె యభిలాష నెఱవేర్పక పోరాదు" అని తలంచి "పుత్రీ! నీవు మగని వెంటఁ బోయిరమ్ము. సత్యవంతుని విషయమున ప్రమాదపడకుము." అని వచించిరి.

సావిత్రియు అత్తమామలయనుజ్ఞ వడసి హృదయమున కారుచిచ్చువలె భయము బాధించుచున్నను మొగమున చిఱునవ్వును బాయక సతితోడఁ బోయెను. అప్పుడు వారిట్లు మాటలాడిరి.

సావిత్రి యత్తమామలచే ననుజ్ఞ తీసికొనుట.

S. Page 68.

సత్య ——ప్రియురాలా! చూచితివా గరుడుఁడు కట్టి తీర్చుచున్నాఁడు.

సావిత్రి——తుదకు మనకు మేలే కలుగును గదా భయము లేదు. ఈయరణ్యమెంతభయంకరముగ నున్నది. కావుననే కాంఁబోలు సంసారమును గహనమునకుఁ బోల్తురు.

సత్య —— స్నిగ్ధయు ముగ్ధయు శీలవతియు నగు భార్యలేని వానిసంసార మని చెప్పుము.

సావి——నాజన్మము నేఁటికి సార్థకము.

సత్య——సారసాక్షీ! యీ సారసాకరము వీక్షింపుము.

కవిరాజవిరాజితము.

ఉ. "తోరములై వికసించిన కైరవ తోయరుహంబుల
షట్పదఘుం | కారములన్ బహుళంబుగఁ బర్వెన
క్రౌంచరథాంగ బకప్రజసం | చారములన్ నట
సాలరసాలకుచందన భూజవితానలస | త్తీరము
లన్ గడుసొంపుదలిర్ప నుతింపఁదగున్ హ్రద
ముజ్జ్వలమై." హరిశ్చం.

హంస లేమిని ఈసరసి యింత రమణీయముగ నుండియుఁ బ్రకాశింపదుకదా?

సావి—ప్రాణనాథుఁడు లేని కాంతవలె ననుఁడు.

సత్య—భ్రమరకుంతలా! యీ వినోదము చూడుము. ఈతుమ్మెద మోదుగుపువ్వని తలఁచి చిలుకముక్కుపై వ్రా

లెను. చిలుకయు తుమ్మెదను నేరేడుపండను కొని ముక్కుతోఁ బొడిచెను.

సావి—యథార్థజ్ఞానము లేనివా రిట్టులే భ్రమపడుచుందురు. నాథా! రెండును నలుపే కదా కాకికి కోకిలకు భేదమెట్లు తెలియవలయును?

సత్య—పండితునకు మూర్ఖునకు భేదమెట్లు తెలిసికొనెదవు?

సావి—పండితుఁడు విననింపుగాను, మనస్సునకు ఆహ్లాదకరముగను, యుక్తివివేకముతోఁ గూడినట్లును సంభాషించును?

సత్య—అట్టులే యిది కాకియని యిది కోకిలయని స్వరముచేత తెలిసికొనవలయును.

సావిత్రి—వానకాలమందు కోకిల లేల కూయవు?

సత్య—కప్పలు విశేషించి కూయుచుండును గనుక

సావిత్రి—సత్యము. అజ్ఞానులెల్లయెడఁ విజృంభించి కూయునపుడు సత్కవులకు మౌనమే శ్రేయస్కరము.

సత్య—బాలా! ఆగండుఁదుమ్మెద దుర్బద్ధి చూచితివా? కమ్మని తేనెగల కమలమును విడిచి మంచివాసనయు, బంగరు వర్ణము, గల కేతకిని చూచి బంగారు కమలమని ఉవ్వినవచ్చి యామధుపము దానియందు వ్రాలెను. దట్టంపుఁ బుప్పొడి కన్నులలోఁ బడ గ్రుడ్డిదై

ముండ్లచే తెక్కలు చినుఁగుటవలన పోలేక యుండలేక బాధపడుచున్నది.

సావిత్రి—తమకు సద్వస్తువు లభియించి యుండియు తృప్తిలేక మోహాశాపతకులగు చపలుల బ్రతు కిట్టిదే.

సత్య—కురంగలోచనా! ఆయేటియొడ్డున దైవచిత్రము గంటివా. నిండుచూలగు నొక ఆఁడుజింక ప్రసవవేదనచే నడవలేక బాధపడుచుండ నొకవేఁటకాఁడు దానిని జంపుటకు వింట బాణము సంధించి యెదురుగ వచ్చెను. వెనుక తేఁచుకుక్క దానిని తఱుముకొని వచ్చుచున్నది. ఒక ప్రక్కవల పన్నఁబడి యున్నది. మఱియొక ప్రక్క

కాలుచిచ్చు పైపైకి వచ్చుచున్నది. ఆపత్కాలమందు నేమిచేయుటకు సాధ్యపడమని గజేంద్రునివలె దైవమును చింతించుచునట్లు జింక నిట్ట నిలఁబడెను. దైవమా! దీని నెట్లు కాపాడెదవో యనుకొనుచుంటిని. ఇంతలో బాణము విడువనున్న వేటకానిని తేలుకుట్టెను కాబోలు. ఆనొప్పితో వాఁడు తటాలున విడిచిన బాణము ఱేఁచుకుక్కకుఁ దాఁకి యది చచ్చెను. అగ్నిజ్వాల యొకటి యెగసివచ్చి వలలను కాల్చెను. ఈలో ఆ జింకకు చచ్చిన పిల్ల పుట్టెను. కావున ఆఁడుజింక తప్పించుకొని యుఱుకుచున్నది.

సావి—కొండలవంటి యాపదలైనను దైవకృపవలన సూర్యుని ముందటి మంచువలె నగుటయేగాక కీడుగఁ దోఁచినదే మేలుగను నగును. మనకును దైవమే శరణము.

సత్య—మన కేమి యాపదవచ్చినదని యట్టుల నెదవు.

సావి—గరుడి కట్టిన దంటిరే. ఆమాటకుఁగా నంటిని.

సత్య—అట్లయిన సరి. విరిఁబోణీ! యీ ఫలవృక్షములను చూడుము. పూలయందు భృంగములు, కొమ్మలయందు విహంగములు, నీడలయందు కురంగములు కలిగి యనేక జీవజంతువులకు

నిలువబట్టి తా నెండలో నిలిచియు నెండ వడఁబడివచ్చినవారి తాప మార్పుచున్నవి.

సావిత్రి—అంతియ కాదు. ఈచెట్లయందు గొప్పగుణము కలవి యనేకములున్నవి. చందనము తన్నునఱకు ఆయుధమునకు నఱకువానికిఁగూడ మంచివాసన కలిగించుచున్నది. తనకు చిన్నప్పుడు ఎట్టిదో నీరు మనుష్యులు పోయఁగా నారికేళము దానిని జ్ఞప్తియందుంచుకొని అమృతమువంటి తియ్యని నిర్మలమైన నీళ్లను తలతో మోచి మరల మనుష్యుల కిచ్చుచున్నది.

సత్య—అన్ని చెట్లు అట్టివని చెప్పవలను

పడదు. ఈబూరుగు చెట్టును జూడుము. దీనియందు కాయ లెంతయుందముగను పెద్దవిగ నున్నవో కంటివా? ఇవి యేవో గొప్ప ఫలము లనుకొని చిలుకలు వీని చుట్టు తిరిగి తిరిగి శ్రమపడుచున్నవి. కడపట ఆకాయలు విచ్చఁగా లోపల సారము లేదు. దూది గాలికి పోవును. కొన్ని తాము మంచివైనను దుష్టుల కాశ్రయ మిచ్చుచున్నవి. చందనము పాములకు తావు గదా. మొగలులందు మిన్నాగు లుండును గదా.

సావిత్రి—అనేక శాఖలతో దిక్కులకల్లుచున్న యీమఱ్ఱిచెట్టును చూడుఁడు.

బావినీరు, మఱ్ఱినీడ, ఇటికయిల్లు ఇవి యెండకాలమందు చల్లగను చలికాలమందు వేడిగనుండును.

సత్య—శ్యామా! మఱియొకటి విడిచితివేల?

సావిత్రి—కొన్నియెడల విధివిధాన మిట్టిదని యూహింప సాధ్యపడదు. అడవిలోని గరికమేసి పల్లలో నీళ్లుద్రావి యెవరికేయపకారమును జేయని జింకల పొక్కిలిలో కస్తూరినుంచి బ్రహ్మదేవుఁడు వానిని వధ్యములుగ చేయుచున్నాఁడే దానిని దుష్టులకంతమందుంచిన నెంతలోకోపకారముగ నుండును.



ఆడుజింక దైవకృపచే మృతినుండి తప్పించుకొనుట.

S. Page 74.

సత్య — హరిణాక్షీ! జింకలు చచ్చియు లోకుల కుపయోగ పడుచున్నవి. వాని చర్మములను మునులును ఆశింతురు గదా. ఈచంపక వృక్షమును చూడుము. ఇందు కొన్ని యెట్టి సంపెగలు. ఇవి మనోహరముగ లేవా? మంచివాసన గలవి గావా? ఏల తుమ్మెదలు వీని నంటవు? తక్కిన పుష్పములు చేసిన పుణ్యమేమి? ఇవి చేసిన పాప మేమి?

సావిత్రి — ఈశ్వరాజ్ఞ బలిష్ఠమైనది.

సత్య — కానుగుచెట్ల నీడ కన్నతల్లి కడుపు చలువ రెండు నొక్కటి యందురే చూచితివా ఆకానుగుల గుంపును. అదో వెదురుపొద. సద్వంశమనిన దీని

కే తగును. దీనిని తుండు తుండుగ నఱకి, కాల్చి బెజ్జములు బొడిచినను విరసముగఁ బల్కదు కదా? సద్వంశమునఁ బుట్టిన వ్యజనము సుజనునివలె దాను త్రిప్పఁబడియైన నితరుల తాపమార్చును కదా. ఇది కఱవుకాలమందుమాత్రమే పూచి కాచి వనవాసులకు ఆహార సౌకర్యము కలిగించుచున్నది. అయినను ఉఱుమునప్పుడు మాత్రము వీని చెంతనుండ రాదందురు.

సావిత్రి—నాథా! అవి యేపక్షులు? అందొకటి యేల తలవ్రాల్చి యున్నది?

సత్య—అవి చక్రవాకములు. రాత్రి సమీ

పించెనుగదా ఇఁక తమకు వియోగము కలుగునని వెఱచి ఆఁడుపక్షి విచారపడుచున్నది.

సావిత్రి — అయ్యో, దుస్సహము దుస్సహము.

సత్య—పిఱికీ! అల్పకాలమే. సూర్యుఁడుదయించిన నది మరలఁ బతితోఁ కూడుకొనును.

సావిత్రి—తథాస్తు. మీరు సత్యవంతులు గదా మీమాట సత్యమగుఁగాక.

సత్య—కరుణావతీ! పరదుఃఖ మేమియు సహింపలేవు గదా? నామాట బలమేల యది విధి యేర్పాటే.

సావిత్రి—తథాస్తు.

ఇట్లు వారు సంభాషించుచు పోవుచుండ సావిత్రిమాత్రము ఏవేళ కేమో యని నూఱు కన్నుల ఱెప్పలు వ్రాల్పక యాయన నే చూచుచు మునివాక్యములు స్మరించుచు ఎడపాదడపా ప్రొద్దువంకఁ గనుచు రెండుగఁ జీలుచున్న డెందమును దిటపఱుచుకొనుచు తన మనస్సులోని సంతాపము కించుకయు వెలిదోఁపనీయక యేమియు నెఱుఁగనిదానివలె అడిగినవానికెల్ల సదుత్తరములిచ్చుచు మందగమనమున పతి వెంటఁ బోవుచుండెను.

సత్యవంతుని మరణము.

భార్యాసహాయుండైన సత్యవంతుఁడును ఫలములఁ సంగ్రహించి గంపనించి గొడ్డ

లితోఁ గట్టెలు చీల్చుచుండ నున్నట్టుండి దేహమున చెమట గాఱఁ జొచ్చెను. తల నొప్పి సహింపరాకపోయెను. అతఁడును భార్యను సమీపించి "కల్యాణీ! గాసిచేత నాకు శిరోవేదన సహింపరాకున్నది. అంగసంధులన్నియు సడలుచున్నవి. మనస్సు చక్రమువలె కట్టినట్టు తిరుగుచు నిలుప వశముకాకున్నది. తలయందు శూలములతోఁ పొడిచినట్టున్నది. మితభాషిణీ! కన్నులు తిరుగుచున్నవి. నిలువఁ దార్ఢ్యము లేదు. అస్వస్థుండనైతినని తోఁచుచున్నది. కొంచెముసేపు విశ్రమించి మఱల లేచినఁగాని నేనే కార్యము చేయుటకు శక్తుఁడను గాను. కావున పండు

కొనెద" ననఁగా సావిత్రియు నేలఁగూర్చుండి నాతొడపై శిరస్సుంచి పండుకొనుఁడని యతనిని పట్టి మెల్లగ పరుండఁబెట్టెను. సావిత్రియు నారదుఁడు చెప్పిన దినము ముహూర్తము క్షణము సంప్రాప్తించెనని లెక్కించి యాయన సూచించిన పాపపువేళ రానే వచ్చెఁగదా యని విచారపడుచు పతివంకఁ జూచుచుండెను.

యముఁడు సత్యవంతుని గొనిపోన వచ్చుట.

ఆయనకు ఊర్పు సన్నగిల్లెను. పాదములను హస్తములను చలువలు క్రమ్మఁజొచ్చెను. స్మృతి దప్పెను. గుండె లదరుటు మానుచుండెను. నాభియొద్ద ప్రాణవా



యముఁడు సత్యవంతుని గొనిపోవవచ్చుట.

S. S. Page 84

యువు ముడివీడి స్థానము చలించెను. నాడులు మోఁచేతి దాఁటుచుండెను. అట్టియెడ రక్తవస్త్రధరుఁడును, బద్ధమౌళియు, సూర్యతేజుఁడును, వపుష్మంతుఁడును, శ్యామగాత్రుఁడును, రక్తాక్షుఁడు, పాశహస్తుఁడును, భయావహరూపుఁడును నగునొక పురుషుఁడు సత్యవంతుని ప్రక్క నిలుచుండి చూచుచున్నట్లు ఆమెకు కనఁబడెను. సావిత్రియు నాథునిశిరము క్రింద నుంచి తటాలున లేచి రెండుచేతులు జోడించి మ్రొక్కి గుండెలు తటతట కొట్టుకొనుచుండ వణఁకుమేనితో "మహానుభావా! అమానుషమైన నీ దేహమున కాంతి చూడ నీవు దైవతమువని నాకుఁ దోఁచుచున్నది.

దేవేశా! నీ వెవ్వఁడవు? ఏ కార్యమున నిటఁ
కు విచ్చేసితివి. ఎఱిఁగింపుమీ" యనెను.

యముఁడు—సతీమణీ! నేను సామాన్యు
లగు మనుష్యులకు గోచరించువాఁడను
గాను. నీవు తపశ్శక్తిసంపన్నవు కా
వున నన్నుఁ జూడఁగలిగితివి: నీవు
మహాపతివ్రతవు కావున నీతో సంభా
షింప సంతోషమగుచున్నది. నన్ను
యమునిఁగాఁ దెలిసికొనుము. ఈనీభర్త
సత్యవంతునకు అవసానకాలము ప్రా
ప్తించినది. ఈయనను పాశబద్ధుని చేసి
తీసికొనిపోవ వచ్చితిని.

సావిత్రి—దేవా! నాయందలిమైత్రికి నీకు
నేనొనర్చు నమస్కారములు గ్రహిం

పుము. జీవులను గొనిపోవ నీదూతలు
వచ్చువారని విని యుంటిని. ప్రభూ!
నీవే స్వయముగ నిప్పుడు రాఁగారణ
మేమి?

యముఁడు—మనుష్యులు చేసిన పుణ్య
పాపము లాలోచించి యెట్టి యోగ్యత
గలవారియొద్ద కెట్టివారిని పంపవల
యునో యట్టివారిని బంపుచుందును.
ఈసత్యవంతుఁడు ధర్మాత్ముఁడు. సుగుణ
సాగరుఁడు. ఇట్టివాని యొద్దకు భటు
లను పంపుట ధర్మముగాదు. కావున
నేనే వచ్చితిని.

అని సత్యవంతుని దేహమునుండి అం
గుష్ఠమాత్రపురుషుని బలాత్కారముగ

వెడలించి పాశమునఁ గట్టి దక్షిణాముఖముగాఁ బోవుచుండెను. సత్యవంతుని శరీరము తేజోవిహీనమై నిశ్చేష్టమయ్యెను. సావిత్రి దుఃఖార్తయై తన పతిగాత్రమును మృగము లంటకుండునట్లు పదిలపఱచినియమవ్రతయు మహాభాగయు పతివ్రతయుఁ గావున యముని వెన్నంటి పోవుచుండెను.

—* సావిత్రి యముని వెంట నంటుట. *—

యముఁడు కొంతదూర మట్లుపోయి తిరిగిచూచి సావిత్రితో నిట్లనియె.

ఆ. వలదు వెంటరాకు పొలఁతి నివర్తింపు
మూర్ధ్వదైహికముల నాచరింపు
భర్తృఋణమువలనఁ బరిముక్తవైతివి
మిగుల సంకటంబు మీఁదితెరువు. భార.

రాఁగలంతవట్టు వచ్చితివి. వృథా యేల శ్రమించెదవు పొమ్ము.

సావిత్రి—

క. పతి యెచటి కేగుఁ దానుగఁ
బతి యెచటికిఁ గొంచుఁబోఁబడు నచటికిఁ ద
త్సతియును బోవుట దేవా!
హితము సనాతనపుధర్మ మిది యండ్రు బుధుల్.

క. "గురుభక్తియు నీకరుణయుఁ
బరమపతివ్రతము తపము భర్తృస్నేహం
బురవుగఁ గల నేను దయా
కర! యరుగఁగ రాని తెరువు గలదే యెందున్.

ఆ. ఏడుమాట లాడ నెట్టివారును మిత్రు
లగుదు రండ్రు పెద్దలైనవార
లిన్నిమాటలాడ నే నీకుఁ జుట్టంబ
ననుచుఁ జెప్పవలెనె యర్కతనయ!" భార.

కావున నావిన్నవించు వాక్యములు వినుము. వేదాధ్యయనముతోడి బ్రహ్మచర్యము, గృహపతిత్వము, వానప్రస్థము, సన్న్యాసము అను నాలు గాశ్రమములు ఆత్మజ్ఞానము లేని వానికి ఫలయుతములు కావు. ఇన్నిటికిని ధర్మము ప్రాణమై యున్నది. ధర్మ మనఁగా ఆత్మజ్ఞానము. కావున నన్నిటిలో ధర్మమే ప్రధానమని పెద్దలు చెప్పుదురు గాని వరుసదప్పని యాశ్రమాచారమని చెప్పరు. ఈ నాలుగిటిలో నేదైన నొకటి ధర్మయుక్తముగ జరపువానికి తక్కిన మూఁడు ననావశ్యకములు. ఈ కారణముచేత నే ధర్మమే ప్రధానమని పెద్దలు చెప్పుదురు.

అనిన ధర్మరహస్యయుక్తములైన యా బాలికమాటలు వినఁగానే యమునకు సంతోషముచేత దేహముప్పొంగి యాహా! యీమె తాను గృహస్థధర్మమందుండియే యాత్మజ్ఞానమును సంపాదించితిననియు నట్టి తనకు పతివియోగముచేతఁ గలుగు నాశ్రమాంతరము విధించుట నాకు ధర్మముగాదనియు హితత మెఱిఁగించుచున్నది. ఈమె వయస్సెక్కడ? ఈమె ధర్మజ్ఞానమెక్కడ? అని తటాలున ఆమెప్రక్కకు తిరిగి చూచి "బాలికా! నీవు సుస్వరముతో అక్షరస్ఖాలిత్యము లేక కలగ్రాహ్యపదములతో హేతుయుక్తముగఁ బలికిన పలుకులకు మిక్కిలి సంతోషించితిని. కావున నీకొక్క వర మొసఁ

గెదను నీ పతిప్రాణముదక్క నేదైనఁ గో
రుము" అనిన సావిత్రి యిట్లనియె.

ఆ. కలిమిఁ గోలుపోయి కానలపాలయి
కనులు గానరాక కష్టపడెడు
మామగారి కిపుడు మరలఁ గన్నులొసంగి
బలము నీఁగదయ్య భవ్యతేజ!

అనిన యముఁడును నీకోరినవర మిచ్చి
తిని నిలుము. ఇఁక రాకుము. బడలియున్న
దానవు. అనిన సావిత్రి యిట్లనియె. నా
పతితోడ నుండు నాకు బడలిక యెక్కడిది?
నా ప్రాణేశ్వరుని గమ్యస్థానమే నాకును
గమ్యస్థానము. నీవు నావల్లభు నెచటికిఁ
గొనిపోయెదో నేనచటికే వచ్చెదను. నా
మనవి మరలఁ గొంత వినుము. దేవేశ!

సజ్జనసాంగత్యము క్షణకాలమైనను శ్రేష్ఠ
ము. ఇఁక సజ్జనమైత్రి యుత్తమోత్తమ
మని వేఱ చెప్పనేల! సజ్జనసాంగత్యమె
న్నఁడు ఫలహీనముగాదు. కావున సర్వ
దా సజ్జనసహవాసము మానరాదు.

అనిన అంతకుఁడాశ్చర్యపడి తన్వీ! నీ
వచనామృతధారలు మనోనుకూలములై
నావీనులకు విందొనర్చుచున్నవి. నీవా
క్కులు హితములై బుధులకును జ్ఞానబోధ
మభివృద్ధియొనర్చునవియై యున్నవి. బా
లికా! నీవు నీపతి ప్రాణముతప్ప రెండవ
వరము గోరుము. అనిన సావిత్రి యిట్లఁ
నియె.

"రాజ్యము వైరులచే నపహృతమగు

టవలన మామామగారు స్వకులధర్మమును పాలింప నసమర్థులై యున్నవారు. కావున వారి రాజ్యము వారికి ప్రాప్తించునట్లును, వారు స్వధర్మమునుండి చెడకుండునట్లును దేవా! యనుగ్రహింపుము."

అనిన శ్రాద్ధదేవుఁడు "కుమారీ! నీవు కోరినవర మిచ్చితిని. నీ మామగారికి స్వరాజ్యము లభించును, స్వధర్మమునుండియు ఆయన వీడువడకుండును. నీవు చాల శ్రమించితివి. ఇంక మరలి పొమ్ము." అనిన సావిత్రి యిట్లనియె.

ధర్మమూర్తీ! ప్రాణికోట్లన్నియు నియమమముచే బద్ధములు. నీవును నియామమము చొప్పుననే వీనిని గొనిపోవుచుఁవుగాని

యిచ్చవచ్చినట్టు విచ్చలవిడి గొనిపోవువాఁడవు కావు. కావుననే కదా నీకు యముఁడను ఖ్యాతి లోకమున నెగడియున్నది. నాయందుఁ గల ప్రీతిచే నామాటలు నీ వీనులఁ జొరనిమ్ము.

చ. ఎడపక వాఙ్మనఃక్రియల నేరికిఁ హింసయొనర్పఁ
బూనక యెయ్యెడలను దీనులం గరుణ నేర్పడఁ
బ్రోవను చూతు; రిచ్చుచోఁ గడమ పడంగనీ కెది
రికాంక్షితముల్ దుదిముట్టఁ దీర్తు రెక్కుడు
మది గూర్తు రాశ్రితులకున్ విను మన్నియు నా
ర్య ధర్మముల్. భార.

ఇంక లోకమో ప్రాయకముగ నీరాజకుమారునట్టిది. మనుష్యులు భక్తిశక్తుల నిపుణులు గారు. కావుననే కదా సత్పురు

షులు తమ్మాశ్రయించిన వైరులయందును దయనే చూపి రక్షింతురు. అనిన దండధరుఁ డిట్లనెను. మధురవాణీ!

క. తృషితుఁ డగువాని శీతల
తుషారతోయములు మోదితునిఁ జేయుగతిన్
హృషితాంగుఁ జేసె ననుఁ గ
ల్మషరహితము లైన నీ సమంజస భణితుల్. భార.

కావున నీ ప్రాణేశ్వరు జీవితము దక్క నింకొక్క వర మేదైనఁ గోరుము. అనిన సావిత్రి యిట్లనియె. కాలమూర్తీ! నా తండ్రి మద్రేశ్వరుఁడు పుత్రహీనుఁడై యున్నవాఁడు. ఆయనకు వంశకరులగు నూర్వురు కొడుకులను నౌరసుల నొసఁగ ననుగ్రహింపుము.

యముఁడు—భూపపుత్రీ! నీతండ్రికి నూర్వు రౌరస పుత్రులు వంశకరు లుదయింతురు.

ఆ. వలదు నిలువు మింకఁ బవలక నీభక్తి
మగని కెక్కె; దుర్గమంపుఁ ద్రోవ
యిది; కృతంబు లయ్యె నెల్లవియును; నిట్లు
వచ్చు సెలవు లేదు వనజనయన! భార.

చాలదవ్వు వచ్చితివి. ఇఁక మరలి పొమ్ము అనిన ఆపరమపుణ్యశీల యిట్లనియె.

రవికుమారా! పతిసన్నిధానమున నుండు నాకు దవ్వన నెద్ది? నామనస్సింతకంటెను ఎక్కువ దవ్వున కైన పరువెత్తుచున్నది. నాకై నీవు నిలువవలదు. నామాటలు నీవు పయనించుచునే వినుము.

వివస్వంతుని తనయుఁడ వగుటచే నీవు వైవస్వతుఁడన ప్రసిద్ధిఁగాంచితివి. వీరు శత్రువులు వీరు మిత్రులు అను తారతమ్యము లేని ధర్మముచే ప్రజల నెల్ల సమదృష్టిఁ జూతువు కావునఁ గదా ధర్మరాజను నామము నీకు బుధులొసంగిరి. సజ్జనులయం దుంచు విశ్వాసము జనులు తమయందును నుంచుకొనరు. కావుననే లోకులు సజ్జన స్నేహమును విశేషము కోరుచుందురు. విశ్వాసమును గలిగించునది నిర్మలమైన మంచి మనస్సే. ఆ కారణముచేతనే కదా ధర్మాత్ములనే లోకము నమ్ముచుండును.

అనిన కలకంఠ పలుకులవంటి యా కలికి

పలుకులు విని సమవర్తి సంతోష సాగరమున మునిఁగి యా రాజపుత్రితో నిట్లనియె.

పవిత్రచరిత్రా! తేనెబిందువులతో సాటియగు నీ మాటలు మఱియొచ్చటను విన్నవాఁడనుగాను. ధర్మసంయుతమును, అర్థయుక్తమును, సందర్భోచితమును, నైన నీ సూక్తి నామనస్సును మఱిమఱి కరఁగించుచున్నది. కావున సత్యవంతుని ప్రాణము దక్క మఱియేవరమైనఁ గోరు మిచ్చెదను.

ధర్మరాజా! కులోద్వాహులును, సత్యావంతున కౌరసులును, నాకుఁ దనూజులు నగు పుత్రుల బలవీర్యసంపన్నుల నూర్వుర నొసంగుము. ఇదియే నా నాలుగవ వరము.

అనిన నా బాలికయుక్తికి యముఁడు ఆశ్చర్యమున నొందుచు మేలు మేలని మెచ్చుకొని "పుత్రీ! నీవు కోరినట్లు బల వీర్యశాలులగు నూర్వురు కొడుకులు నీకుఁ గలుగుదురు. ఇఁక రాకుము పొమ్ము. చాలదూరమువచ్చి ఆయాసపడితివి." అనిన ఆనుడులు విని యా మహాభాగ యిట్లనియె.

రుక్మిణి—అప్పా! అప్పా! సావిత్రి బలే యుక్తి చేసినది. చిక్కినాఁడా మోచేతిలో యమధర్మరాజు.

తండ్రి—అదెట్లు?

రుక్మిణి—సత్యవంతుఁడు బ్రదుకకపోయిన యెడల ఆమెకడుపున సత్యవంతున కెట్లు కొడుకులు కలుగుదురు?

అన్నపూర్ణ—యమధర్మరాజు పిచ్చిపని చేసినాఁడు. ఆవరమును నే నీయ ననవలసి యుండెను.

రుక్మిణి—అదెట్లునే? సత్యవంతుని ప్రాణమొకటి తప్ప నేది కోరినను ఇచ్చెదనని చెప్పెను. ఈవర మీయకుండిన యమధర్మరాజే అసత్య మాడినవాఁడగును.

సావిత్రి—దయానిధీ! సజ్జనులు సర్వదా శాశ్వత ధర్మవృత్తులు. సజ్జనులొక మాటచెప్పి దానికై దుఃఖపాటుగాంచరు. ఆనుడి తప్పరు. సజ్జనులకు సజ్జనులతోడి సహవాసము నిష్ఫలము కానేరదు. సజ్జనులవలన సజ్జనులకు

భయ మెన్నఁడు కలుగనేరదు. సజ్జనులు సత్యముచేతనే సూర్యుని ప్రవర్తింపఁ జేయుచున్నారు. సజ్జనులు తను తపస్సుచేతనే భూమిని ధరించియున్నారు. భూత భవిష్యత్తులకు సజ్జనులే గతి. సజ్జనులనడుమ దుఃఖపడు సజ్జనుఁడుండఁడు. ఇది యార్యసమ్మతమైన సనాతనధర్మమార్గ మని యెఱింగి సజ్జనులు ప్రతిఫలము గోరక పరులకు హితము నాచరింతురు. సత్పురుషులు ప్రసన్నులైనచో ఆశ్రితులకోరికల వ్యర్థపఱుపరు. అట్టి ఆశ్రితులకు గౌరవహాని కాని అర్థహాని కాని కలుగనేరదు. ఈప్రసాదార్థ గౌరవములు సజ్జ

నులయందు నిత్యమై వర్తిల్లుచుండును. కావుననే చుమీ యెల్లదశలందును సజ్జనులే రక్షకులగుచున్నారు.

యముఁడు — పతివ్రతారత్నమా! నీవు మనోనుకూలముగ ధర్మసంహితముగ వచించుసూక్తుల విన విన నీయందు నాకు ప్రీతి యంతకంతకు నెక్కువగుచున్నది. కావున నీక నుత్తమవరము నొకటి గోరికొనుము.

సావిత్రి — దేవా! ఈసత్యవంతునకు నాయందు సుతశతకంబు గలుగ ననుగ్రహించితివి. అట్టి సుతలాభంబు మా యిరువుర సాంగత్యమునఁ గాని కలుగనేరదు. కావున నా జీవితేశ్వరు బ్రది

కింపుము. నాపతిని విడిచి నేను బ్రదు
కఁజాలను.

క. పతిలేక కలుగు సుఖమును
బతిలేక లభించునట్టి స్వర్గపదంబుఁ
బతిలేని యట్టిసంపద
బతిహీనవు బ్రదుకు నేను బడయఁగ నొల్లన్

క. శతపుత్రలాభ మొదవఁగ
నతికరుణ వరం బొసంగి యదయత నాహృ
త్పతిఁ గొనిపోవఁగఁ జనునే?
బ్రతికించి పతిన్ యథార్థవాదివి కమ్మీ.

సత్యవంతుఁడు మరల బ్రదుకుట.

అని కరకమలములు ముకుళించి నిలువంబడిన పతివ్రతని జూచి కరుణార్ద్రచిత్తుఁడైన యంతకుండు "కులదీపకురాలా! ఇదిగో నీపతిని విడిచి పుచ్చితిని. సాధ్వీ!

ధర్మార్థసంహితములైన నీవాక్యములు నామనమును బాయకున్నవి. నీమగఁడు నీతోడ నాలుగునూర్ల సంవత్సరములు ఆయుష్మంతుఁడై సుఖించి, యజ్ఞాదు లాచరించి, నీయందు పుత్రశతంబుఁ గాంచి, సుఖించును. నీపుత్రులును పుత్రపౌత్రయుక్తులై యుత్తమక్షత్రియులై నీ నామధేయమునఁ బ్రసిద్ధిఁ గాంచువారు. నీతండ్రియు నీతల్లియగు మాళవియందు నూర్వుఱు పుత్రులం బడయఁగలఁడు. వారును మాళవులనుపేర సంతానయుక్తులై వెలసెదరు. నీకు శుభమగుఁగాక. యథాసౌఖ్యముగ నిర్భయముగ మరలి పొమ్మని తానును తన వీటికిఁ బోయెను.

మద్రరాజకన్యకయుఁ బతిని బడసినదై మరలి కళేబరమైన తనపతి శవమున్న యెడకు వచ్చి మునుపటియట్లు తనపతి శిరమును తనతొడమీఁద నుంచుకొని కూర్చుండియుండ సత్యవంతుఁడు ఊర్పుపుచ్చుచు ఇంచుక కదలుచు లబ్ధసంజ్ఞుఁడై కన్నులు తెఱచి యెచ్చటికో పోయివచ్చిన వానివలె నత్తెఱవ వంకఁ జూచి మెల్లన నిట్లనియె.

“ప్రాణేశ్వరీ! నేను దీర్ఘముగ నిద్రించితిని. నన్నేల మేలుకొలుపవైతివి. నన్నుఁ బట్టి కట్టికొని పోయిన నల్లని పురుషుఁడెవఁడు? అతఁడేఁడి?” యనిన సావిత్రి యిట్లనియె.

“ప్రాణేశ్వరా! నా తొడమీఁదనే మీరు చాలసేపు నిద్రించితిరి. మీకు గోచరించినవాఁడు భగవంతుఁడగు వైవస్వతుఁడు. మీకు నిద్ర మెలఁకువవచ్చెను గదా? విశ్రాంతిగాంచితిరి గదా? రాత్రి యెంతయుఁ బ్రొద్దయినది. గాఢాంధకారము లోకమును ముంచుచున్నది. నడువ శక్తి గలదేని యాశ్రమమునకుఁ బోవుదము లెండు.

అనిన సత్యవంతుఁడు సుఖసుప్తుఁడై లేచినవానివలె లేచి దిక్కులెల్లఁ గలయఁ జూచి యిట్లనియె. “తనుమధ్యా! ఫలాదులకై నీతోడ వనమునకు వచ్చి ఫలముల గ్రహించి కట్టెలు చీల్చుచుండ తాళరాని

తలనొప్పి పుట్టుటయు సహింపలేక నీకుఱు వుపై శిర ముంచి పరుండితిని. నీకౌఁగిట నేను నొడ లెఱుఁగక నిద్రించితిని. అట్టి సమయమున లోకమంతయు చీఁకటు లావరించునట్లు తోఁచెను. ఆయిరుల నడుమ ఘోరరూపము గలవాఁడు, నల్లని మేనివాఁడు, మహాకాంతి యుక్తుఁడు నాకనులకు గోచరించెను. వాఁడెవఁడో. ఇది కలయో నిజమో నీ వెఱుంగుదేని తెలుపుమనిన "రేయి ప్రొద్దెక్కుచున్నది. సర్వము రేపు మీకు నెఱిఁగింతును. సూర్యుఁ డస్తమించెను. చీఁకట్లాక్రమించెను. నట్టడవి నున్నవారము. మీతల్లిదండ్రులు మనమింత తడయుట కెంతతపింతురో.

మ. అదె నక్తంచరు లిందు నందును మహోగ్రాకారు
లై క్రందుగా । మెసలం జొచ్చిరి, ఘోరఫేర
నరుశుల్ మిన్నంటెఁ దీవ్రంబులై । పవశబ్దంబులు
మీఱెఁ, జూడు కలయంబాఱం గోపంగెం బెనుం ।
గదుపుల్ గట్టి మృగంబు, లెంతయు భయోత్కం
పంబు నా కయ్యెడిన్. భార.

క. విను నీవు తడయుటకు మీ
జననియు జనకుండుఁ గరము సంతాపభరం
బునఁ బొందుదు రింతకుఁ గ్ర
న్నన వారికి సంతసం బొనర్పవె యధిపా! భార.

సత్య — ఆకాశమున మబ్బులు దట్టముగ వ్యాపించియున్నవి. ఒకరి మొగ మొకరికి తెలియరాకుండ చీఁకట్లు క్రమ్మినవి. వనమూ భయంకరముగ నున్నది. ఏమా

ర్గము నీ వెట్లు కనుఁగొనఁగలవు? త్రోవ
నడచుట కెట్లు శక్తురాల వగుదువు?

సావిత్రి——ఇంతకుపూర్వ మీయడవి కారు
చిచ్చుచే దగ్ధమైనది. ఎండుచెట్లింకను
గాలుచున్నవి. వాయువు వీచుటచే
నగ్నియు అందందుఁ గానవచ్చుచున్నది
ఆయగ్నిని తెచ్చి యిందున్నకట్టెలతో
మంట వేసెదను. వెలుతురు కట్టెలు
కొన్ని వెలిఁగించెదను. వానిని తీసి
కొనిపోదము. సంతాపము వీడుఁడు.

చ. తమమును బెల్లుగ్లాఁ బరఁగె; దవ్వు నిజాశ్రమ
భూమియుఁ; మదిఁ, శ్రమమును బాయుదిప్డు
నను చందమయ్యెనఁ జనంగ నేల? యిం। పమ
రఁగ నింతప్రొద్దు సుగుణాకర! యిచ్చటనిల్చి।

రేపు పోఁ, దమె? తెఱఁగెద్ది?" నీమతము తప్పక
సల్పెదఁ జెప్పు మిష్టముఁ.

సత్య——ప్రియా! నాకు శిరోవేదన తొలఁ
గినది. అంగములు స్వస్థములు. తల్లి
దండ్రులఁ జూడక నే నిందుండఁ జాలను.
నాయందు ప్రసన్నురాలవై నన్నాటు
లైన తల్లిదండ్రులఁ గలుపుము. అకాల
మం దెన్నఁడును నేను ఇల్లు విడిచియుం
డినవాఁడను గాను. సంధ్యవేళకు నేనిం
టికి రానేని నా తల్లి వాకిట నిలఁబడి
నాకై నలుదిక్కులు వ్యాకులదృష్టితో
చూచుచుండును. పగటిపూఁట నే నెందు
పోయెద నని నను నాతండ్రి యెంతో
సంతాపపడి కొడుకు వచ్చినాఁడా!

బిడ్డఁడు ఇంకను రాలేదా? అని వేయా
ఱుమార్లు నాతల్లిని అడుగుచుండును.
అట్టివారింతప్రొద్దుపోయినను నేను
రామికై ఆశ్రమవాసులతోడ్పాటుచే
నెందెందు వెదకుచున్నారో, ఎంతదుః
ఖించుచున్నారో, నాకైయేగతి పట్టిరో.
నేనెన్నఁడైన సాయంవేళ నొకనిమి
షము మించి వచ్చిన నన్నుఁ జేరఁదీసి
యొడిలోఁ గూర్చుండఁబెట్టుకొని భుజ
ముపై చేయివైచి మఱియొకచేత నా
చుబుకమును గ్రహించి మోము తమ
వంకకుఁ ద్రిప్పి "నాయనా! కుమారా!
నీవే మాకు దిక్కు. నీవే మాకు గతి.
నీవే మాకు కన్నులు. నీవే మాకు

ఊఁతకఱ్ఱ. నీవే మాకు జీవగఱ్ఱ. మమ్ము
నీవు విడిచిన గడియయొక కల్పముగ
నుండును. తండ్రీ! మా మనోవేదన నీ
వెఱింగి మాకు సంతాపము గూర్పకు
ము. మమ్మును మాకులమును ఉద్ధరించు
భారము నీయందున్నది. ఇహపరము
లందు రెంట నీవే యాధారము" అని
కన్నీరు లురల దీనాలాపములు పలుకు
దురు. అట్టివారు నేనింతతడయుటకు
నెంత విలపించుచున్నారో. ఛీ నాతల్లికి
నాతండ్రికి నాకుఁ గూడ జీవితసంశ
యము గూర్ప పాడునిద్ర నాకెక్కడ
నుండి వచ్చెను. సంధ్యావేళ నిద్రింపరా
దని యెఱిఁగియు నేనేల నిద్రించితిని.

ఇది యేదురాచారఫలము కాఁబోలు. సత్యము సత్యము. ఇంత కాలము నన్ను విడిచి వారు జీవించి యుందు రనుట కల్ల. నాయట్టినిర్భాగ్యున కిం కెక్కఁడి తల్లి ఎక్కఁడితండ్రి? వారే జీవింపనిచో నేను జీవింపనేల? నాకొఱకై నేను దుఃఖింపను గాని నానిమిత్తముగ వారెంత సంకటపడుచున్నారో యని దుఃఖించెదను. వారిని భరించుభారము నాయందున్నది. కావున వారు జీవించి యుండు వఱకు నేనును జీవించియుందును. వారికి ప్రియముఁగూర్ప వచ్చును గదా యని జీవింప నుత్సహించుచున్నాను. వారే నాకు పూజనీయులు.

వారే నాకు పరమ దైవతము. వారిని పూజించుటే నాకు పరమ వ్రతము.

ఆ. "సంధ్యప్రొద్దు నన్ను జనని యెన్నఁడు నిలు
వెడల నీదు; నేఁడు విపినభూమి
మధ్యరాత్రవేళ మసలుట కాయమ
యేమి పాటుపడునొ యే నెఱుంగ.

క. నాయున్నచో టెఱుంగక
యాయాశ్రమవాసు లైన యంగన లతిదుః
ఖాయత్తుఁ డగుచు నడుగును
మాయయ్య దలంకి మాటిమాటికి నింకన్.

సీ. కౌఁగిట ననుఁ జిక్కఁ గదియించి శిరము మూ
ర్కొంచును బాష్పముల్ గురియుచుండఁ
బట్టి! మాయొడలును బ్రాణంబులును నెల్ల
యర్థముల్ నీవ; మాయన్న! నీవు

తేపగా సంసారతీరంబు చేరెద
మని తలంచెదము సుమ్మన్న యన్న!
కన్నులులేని మాకన్నులుఁ గాళులు
నీవ కదన్న; మానిఖిల వంశ

ఆ. మును సముద్ధరించు మోపు నీయదియ క
దన్న; యనుచు నిట్టు లగ్గలంపుఁ
బ్రేమ ననుదినంబుఁ బ్రేముడింతురు వృద్ధు
లక్కటకట! యేమియైరో నేఁడు." భార.

అని గురుభక్తుఁడును గురుప్రియుఁడును నగు నారాజకుమారుఁడు అనేకవిధముల తలఁచి బాహువు లెత్తి హోయని యేడ్చెను. సావిత్రియు శోకపీడితుఁడైన భర్తను జూచి సమాధాన వాక్యములు చెప్పి తనపాణితలమున నతనికన్నీరు దుడిచి యా

ధర్మచారిణి "దేవతలారా! నేను తపము, దానము, హోమము చేసినదాన నేని అసత్యమెన్నఁడు నాడియుండ నేని నాపుణ్యముచే నాయత్తమామలకును భర్తకును ఈ రాత్రి యెట్టి కీడుకలుగకుండుఁగాక" యనుటయు సత్యవంతుఁడు "రాజపుత్రి! మన మిచటఁ దడయరాదు. తల్లిదండ్రులు జీవితులై యుండఁగనే పోయి చూడఁగోరెద. గురువుల కేదైన నెడరు పుట్టినా నేను మరల బ్రదుకఁజాల నని శపథము చేసి చెప్పెదను. కావున నేను జీవింపఁగోరెద వేని నాకు ప్రియమైన కార్యము చేయ నీ కిష్టమేని యాశ్రమభూమికి నన్నుఁ దోడుకొనిపొమ్ము".

అనిన సావిత్రియు వెంటనే లేచి తల వెండ్రుకల ముడిచి పెనిమిటి మడిసందుల తన యిరుకేలు దూర్చి మెల్లన లేవనెత్తి నిలువఁ బెట్టెను. సత్యవంతుఁడును నిబ్బరించుకొని నిలునఁబడి తనహస్తముల మేని దుమ్మెల్లఁ బోఁదుడుచుకొని దిక్కులెల్లఁ గలయఁజూచి గంపపై దృష్టి నిగిడించెను. ఆయన హృదయము గ్రహించి యాబాలిక "నాథా! యీఫలములను రేపు మీరు తేవచ్చును. మన యోగక్షేమార్థము ఈ గొడ్డలిని మాత్రము నేను తెచ్చెదను." అని చెప్పి యాపండ్లగంపను చెట్టుకొమ్మకు కట్టి గొడ్డలిని మాత్రము తీసికొని భర్తయొద్దకు వచ్చి యాతని యెడమ చేతిని

తన యెడమ మూఁపుపై నుంచుకొని తన కుడిచేత నతఁడు పడకుండ కౌఁగిలించి పట్టుకొని యెడమచేత గండగొడ్డలిని దాల్చి యాగజగమన పయనించెను.

సావిత్రీ సత్యవంతులు మరల నాశ్రమమునకు వచ్చుట.

ఇట్లు కొంచెము దూరము పోఁగానే సత్యవంతుఁడును వనాంతరముల వీచు కమ్మని చల్లనిగాలి సేదదేఱి ముఖప్రసన్నత వహించి "భీరూ! రాకపోకలచే నాకిదివఱ కలవాటుపడిన బాట చేరితిమి. కొమ్మల నడుమనుండి తప్పిదారి వచ్చు వెన్నెలయు కొంచెము గోచరించుచున్నది. ఇదో యీ మఱ్ఱిచెట్టునొద్ద త్రోవ రెండుగ చీలుచు

న్నది. ఉత్తరపు మార్గము మన యాశ్రమ మునకుఁ బోవును. నేను స్వస్థుఁడై నైతిని. దేహమునకుఁ బలమును వచ్చెను. భయపడక మనము వచ్చినత్రోవనే త్వరగ నడవుము." అని యిట్లు మాటలాడుచు వారాశ్రమమునకు పోయిరి.

సత్యవంతుని తల్లిదండ్రులు పరితపించుట.

ఈలోపల ద్యుమత్సేనుఁడు లబ్ధచక్షుఁడై దృష్టిపాటవము గలిగి నలుదిక్కులు పాఱఁజూచి యేమి యీవింత యని తన భార్యయైన శైబ్యతో ముచ్చటలాడుచు తన కొడుకు కోడలు ఇంకను రారైరే యని తహతహపడుచుండెను. సూర్యుఁ డస్తశిఖరి మీఁద నిలఁబడెను. సంజకెంజాయలు వ్యా

పించెను. పక్షులు కలకల శబ్దములతో వచ్చి గూండ్లు చేరుచుండెను. ప్రొద్దుగ్రుంకెను. కెంజాయ లడఁగెను. మూఢుని మనస్సును అజ్ఞానము ముంచినట్లు ఇరులు క్రమక్రమముగ లోకమును ముంచుచుండెను. తమ కూఁతలచేఁ దపస్వుల మనస్సులు చలింపఁజేయరాదనియో పక్షులు మౌనము వహించెను. చెట్లయందు రెమ్మలు కొమ్మలు భేద మణఁగి యేకాకారమునఁ దోఁచెను. తుదకు చెట్లుచెట్లు కలసిపోయెను. తొలుదొలుత పలుచన పలుచనగా నచ్చటచ్చటఁ దోఁచి చుక్కలు గగనమున కలయనిండెను. ఆవృద్ధదంపతుల మనస్సున కన్నులు వచ్చిన సంతోషము తగ్గుచు

వచ్చెను. తహతహ పాటొదవెను. కలవరము జనించెను. తత్తఱ హెచ్చెను. సందేహముదయించెను. విచారము మీఱెను. విషాదము ముంచెను. మనస్సు వేయివిధముల పరువిడఁ జొచ్చెను. వారు కాలొకచోట నిలువక కాలుగాలిన పిల్లులవలె నాయనా! సత్యవంతా! కోడలా! సావిత్రీ! కొడుకా! పుత్రా! అమ్మా సావిత్రీ! యని యఱచుచు గట్టిగఁ బిలుచుచు కాఱుచీఁకటిలో త్రోవ తెలియక పోయి ముండ్ల కంపలు గడుసు శిలలు త్రొక్కి పాదము లెఱ్ఱనై, బొబ్బలెగిరి, పగిలి నెత్తురుకాఱ నడవలేక కంటికి కడవెడు కన్నీరు గార్చుచు మరలి వచ్చి యాశ్రమమునఁ గూర్చుండి హా

యని యేడ్చిరి. “హా తండ్రీ! మే మెట్టి నిర్భాగ్యులము. లేక లేక నిన్నొక పుత్రుని గని నిన్నెన్నను సుఖపెట్టఁజాలక యడవులఁ పాలు చేసితిమి. రాజపుత్రుఁడ వని పుట్టినందునకు నీకు మేము చేసినదియేమి? కట్టను మంచి వస్త్రముగాని తినను మంచి యన్నముగాని నాయనా తీసికొమ్మని యిచ్చునంతటి పుణ్యము మేము చేయమైతిమి గదా. ఈపాపపుఁ జేతులు నీకు నారచీరలు నివ్వారికూడే కదా పెట్టెను. మే మెట్టివారమైనను నీవు మమ్ము ప్రత్యక్షదేవతలమని పూజింతువే. ఇహమునఁ బరమున నీవు మమ్ముద్ధరింతువని నమ్మియుండ దైవ మింతటి చిన్నచూపు చూచెనే.

తండ్రీ! నీబాల్యచేష్టలు మేమెట్లు మఱతు
ము? నీవు చేయు సపర్యలు మే మెట్లు
విస్మృతి గాంతుము. ఇఁక మాకెవ్వరు
దిక్కు. హాకోడలా! గుణనిధీ! నీవుకోడల
వా! మాపాలి పెన్నిధాన మని తలఁచి
యుంటిమే. మే మేజన్మమున నేపుణ్యము
చేసితిమో నిన్నుఁ గోడలిగఁ గాంచితి మని
యుప్పొంగుదుమే. నీవుమాగృహలక్ష్మివని
సంతోషింతుమే. వేయిమంది పుత్రికలైన
నను నీ సాటివత్తురా? తల్లీ మీకెవరి కేవి
పత్తు సంభవించెనో. ఒకరిని విడిచి మఱి
యొకరు రాఁజాలక యిరువు రేగతిపట్టితిరో
లేకున్న నట్టడవిని కన్నుపొడుచుకొనినను
కానరాని చిమ్మచీఁకటిలో నడిరేయి దాఁక

తడయనేల" యని యనేకవిధముల విల
పింప నాయాశ్రమమందలి ఋషీశ్వరులు
వచ్చి "రాజేంద్రా! నీకు కన్నులు వచ్చుట
శుభసూచకముగాని యశుభసూచకము
గాదు. ఇదియే నీకు గొప్పమేలు రాఁగల
దని సూచించుచున్నది. ఇట్టి సమయమున
నీకు దుఃఖము కలుగఁ గారణము లేదు.
సావిత్రి మహాపతివ్రత. ఆమెయందు శుభ
లక్షణము లనేకము లున్నవిగాని వైధవ్య
లక్షణ మొక్కటియును లేదు. పతికి దీర్ఘా
యువు కలిగించు మహావ్రతము సాంతము
చేసి యుపవాసముండియే భర్తవెంట పో
యియున్నది. ఆమెకుఁ గాని ఆమెభర్తకుఁ
గాని యొకకీడును గలుగనేరదు. శుభా

చారులకు కీడెవ్వఁడు చేయును? మేము వ్రతనిష్ఠులమై బ్రహ్మచర్య మనవలంబించి గాలి నీరు ఆహారముగాఁ గలవారమై తపస్సు చేయువారము. మామాట తప్పదు. వారికెట్టికీడును గలుగదు అని యనేకవిధముల నోరంత ప్రొద్దు సమాధానపఱచుచుండిరి.

అట్టి సమయమున సావిత్రీసమేతుఁడై సత్యవంతుఁడు ఆశ్రమమునకు వచ్చెను. పోయిన ప్రాణములు మరలవచ్చినట్టులై నాయనా నాయని లేచి ద్యుమత్సేనుఁడు కొడుకును కౌఁగిలించుకొనెను. కూఁతురా యని శైబ్య కోడలిని కౌఁగిలించుకొనెను. వారి కనుల వెంటఁ గాఱుచున్న వేఁడినీరు తటాలున చల్లనయ్యెను. ద్యుమత్సేనుఁడు

సావిత్రి సత్యవంతుని ఆశ్రమమునకుఁ దోడి తెచ్చుట.

S. Page 126.

మునులు ఒకప్రక్క నుండిరి. శైబ్యయు సావిత్రీసత్యవంతు లొకప్రక్క నిలిచిరి.

అప్పుడు మునులు సత్యవంతునిఁ జూచి రాజకుమారా! వనమునకు పోయినవాఁడవు ఇంతసేపేల తడసితివి? సూర్యుఁ డస్తమింపకుండుమున్నె యేల రావైతివి? నీ కేమి యాటంకము కలిగెను? నిన్నెవ్వ రడ్డగించిరి? అనిన నతఁ డిట్లనియె.

మునీంద్రులారా! నేను సావిత్రితోడ వనమునకుఁ బోయి ఫలముల సేకరించి కట్టెలు కొట్టుచుండ నాకు సహింపరాని తలయేరు కలిగెను. దానికి తాళలేక నేను గొంతసేపు పరుండి నిద్రపోయి లేచి వచ్చితిని. ఆ కారణముచే కాలవిళంబ మయ్యెను

మఱేమియు నే నెఱుఁగ. మీకందఱకు నా
వలన చింత కలుగకుండ నర్ధరాత్రమైనను
వచ్చితిని.

మునులు — కుమారా! రాజేంద్రునకు
కన్నులెట్లువచ్చెనో తెలుపఁ గలవా?

సత్య—దాని కారణము నాకేమియుఁ
దెలియదు.

మునులు — అమ్మాయీ సావిత్రీ! మీ
మామగారికి కన్నులువచ్చిన కారణము
నీకు తెలిసియుండవలయును. రహస్య
ముగాక చెప్పఁగూడునేని చెప్పెదవా?
ఇది నీకుఁ దెలియక జరగినదికాదని
మా నమ్మకము.

సావిత్రి—మహాత్ములారా! మీకుఁ దెలి

యని విషయము తెలియరాని విషయ
మేదియుండును? నేఁటికి సరిగ సంవత్స
రము నాఁడు నేను పుట్టినింట నుండు
సమయమున నా వివాహప్రస్తావన రాఁ
గా నే నీ మహానుభావునికుమారుని వరిం
చితిని. ఈ సత్యశీలుఁడు సరిగ సంవత్స
రము నాఁటికి మరణించునని భగవంతుఁ
డగు నారదుఁడు మే మందఱము విను
చుండఁ జెప్పెను. ఆయన చెప్పినదిన
మీదినమే. కావుననే నేను నాపతికి
ఆయుష్యము గోరి త్రిరాత్రోపవా
సము నాచరించి యీయన వెంట
కానకు పోయితిని. నాభర్త పరుండి
యుండ ధర్మరాజు సకింకరుఁడై వచ్చి

ఆయన ప్రాణములను హరించి పితృదేవతలుండుదిశకైపోయెను. నేను వెంటనంటి అనేకవిధముల సత్యవాక్యముల స్తోత్రము చేయఁగా నా కైదువరములిచ్చెను. ఒక వరముచే మామగారికి కన్నులు వచ్చెను. రెండవ వరముచే వీరికి రాజ్యము ప్రాప్తించును. మూఁడవ వరముచే మాతండ్రికి సుతశతలాభము కలుగును. నాలుగవ వరముచే నాకు నూర్వురు కొడుకులు జనింతురు. ఐదవ వరముచే నాపెనిమిటి నాలుగునూర్ల సంవత్సరములు జీవించును అనిన నమ్మహాత్మును లిట్లనిరి.

చ. కరము మహాపదంబునిధి గాఢతమోప్రదమందు
దిక్కులేక । కరయుఁగ మున్న నుండినమహామహు

నంశము నీవు తెప్పవై । పరమసుశీల! యోవిమల
వంశసముద్భవ! సువ్రతాన్వితా! కరుణ సముద్ధ
రించితివి; కల్గుదురే నినువంటి సాధ్వులుకా.

అని యామహాభాగను అనేకవిధముల స్తుతించి రాజుచే వీడుకోలున బసి యాముచ్చటలే చెప్పుకొనుచు వారి వారి యుటజములకు పోయిరి. ద్యుమత్సేనుఁడును కోడలి గుణములగ్గించుచు,

ఉ. కోడల నీవు గావు సుమకోమల! నన్నును నాకు
లంబునుకా । గీడును బొందకుండ దరికించఁ దలఁ
జేర్చిన యట్టి వేలుపుం । బ్రోడవు గేహదేవతవు పో
యిటు జన్మముఁ గాంచి తమ్మ నీ । యీడగు పుణ్య
బోఁడి మనుపెన్నఁడుఁ గంటిమె వింటిమే ధరకా.

ఆ. ఎఱిఁగి యెఱిఁగి యెవతె హీనాయువగు వానిఁ
దాఁ వరించు వలపు తద్దయున్న?

యముని మెచ్చఁ జేసి ప్రాణేశు ప్రాణంబు
మరలఁ దేఁగలట్టి మగువ యెవతె?

అని సంభాషించుచుండ నుషఃకాల మగుటయు కాలోచితకృతముల వారు వారు నిర్వహించి యుదయమున మరల వచ్చినమునులతో సంభాషించుచుండ సాల్వదేశ జనులు సమంత్రిపురోహితులై వచ్చి చక్షుష్మంతుఁడును వపుష్మంతుఁడు నైన ద్యుమత్సేనుఁ జూచి సంతోషమునఁ బొంగి నమస్కరించి యిట్లనిరి.

ద్యుమత్సేనుఁడు మరల రాజగుట.

ఆరోగ్యవంతుఁడవును నేత్రవంతుఁడవును నగు నిన్నుఁ జూడఁగలుగుటకు మే మెట్టి పుణ్యము లొనర్చితిమో యెఱుఁగము. నీ

విరోధిరాజు తనమంత్రిచేతనే చంపఁబడెను. చంద్రుఁడులేని రాత్రివలె మీ రాజ్యము ప్రకాశింపకున్నది. నావపగిలిన జనమువలె ప్రజలు విపత్తున మునిఁగియున్నారు. నట్టడవిఁ దెరువు తప్పినవారివలె నెటుపోవుటకు నేమిచేయుటకు తోఁపక దిగ్భ్రమఁగొనియున్నాము. నీవిప్పుడు పురికి విచ్చేసి మునుపటియట్ల యేలికవై నేలఁ బాలింపుము. ప్రజలకష్టముల నున్మూలింపుము. లోకుల నానందసాగరమునఁ దేలింపుము. నాలుగుజాతులందును ప్రముఖు లెల్ల నిన్నుఁ బ్రార్థింప వచ్చియున్నారు.

అని పెక్కువిధముల వేఁడుకొన ద్యుమ

త్సేనుఁడును ఆశ్రమవాసుల యంగీకారము వడసి వారిచే దీవనల నొంది భార్యతోడను కొడుకుతోడను కోడలితోడను సాల్వపురికి పయనించెను. ద్యుమత్సేనుఁడును సత్యవంతుఁడును రథములమీఁదఁ జనిరి. శైబ్యయు సావిత్రియు పల్లకులయందు పోయిరి. ఇట్లు పోయి ద్యుమత్సేనుఁడు సాళ్వపురిఁ జేరి మరలఁ బ్రభువై ధర్మముఁ దప్పక భూమిఁ బాలించుచుండెను. మద్రరాజును ఈశుభవార్త విని వారిని జూడ వచ్చి యాపద్వృత్తాంత మెఱిఁగి పుత్త్రికను వేనోళ్ల బొగడి పోయి పుత్త్రులను గాంచి సుఖముండెను. సావిత్రియు క్రమముగ నూర్వురు పుత్త్రులఁ గాంచి నాలుగునూర్ల సంవత్సరములు పతితోడ సుఖించెను.

క. ఈసావిత్రి చరిత్రం
బేసతి పఠియించు శ్రద్ధ నెపుడా సతియుం
శ్రీసౌభాగ్య సుతాప్తిని
భాసిలు వైధవ్యభయముఁ బాయు నరేంద్రా!

ధర్మనందనా! వింటివికదా సావిత్రీమాహాత్మ్యము. బాలికయయ్యు తన జ్ఞానసంపదచేతను, పాతివ్రత్యము పెంపునను మృత్యువు వాతఁబడిన మగని బ్రదికించుకొనెను. పుట్టినిల్లు వర్ధిల్లఁ జేసెను. అత్త మామలను కష్టదశనుండి తొలఁగించెను. ఈద్రౌపదియు నట్టిది. మిమ్ము నాపదలనుండి యుద్ధరించును. ఆమె పాతివ్రత్యమే మీకు శత్రుజయము గలిగించి సుఖమిడును. స్త్రీలకు శీలమే యుత్తమ భూషణము. కులమునలం

కరించునది శీలమే. సమస్తము శీలముచేతనే సాధ్యము. అట్టి శీలముచేఁ బ్రకాశించు యిల్లాండ్రఁగల భర్తలకు ఇహాసరసుఖములు కరతలామలకములు. కావున విషాదపడకుఁడని చెప్పి మార్కండేయుఁడు పోయెను.

రుక్మిణి—అప్పా సావిత్రి మగని బ్రతికించుకొనునప్పటికి పదునాలుగు పదునైదు సంవత్సరములపిల్ల గదా. ధర్మరాజు మెచ్చుకొనునట్లు ధర్మవాక్యములు పలుకునంతటిజ్ఞాన మెట్లు సంపాదించెను? ఏపాఠశాలయందుఁ జదివెను? ఆమెకట్టిజ్ఞానము కలిగించిన యుపాధ్యాయులు ఏయేపరీక్షలఁ గడతేఱినవారు?

తండ్రి—సావిత్రి చెప్పిన ధర్మవాక్యములు

సందర్భమునకుఁ దగని పురాణవాక్యములు గావు. ఆవాక్యములు తనకు యమునకుఁ గూడ నన్వయించునవియై యమునకు కర్తవ్యమును బోధించునవియై యున్నవి. ఆత్మజ్ఞానముగలిగి స్వధర్మమున చరించు నాయట్టిదానికి వైధవ్యము కలిగించుట ధర్మమూర్తివగు నీయట్టివానికి ధర్మము గాదనియు నీవు చేయునది సరిగాదనియు సూచన సేయు వాక్యములను సవినయముగా వచించెను. ఆమె పతిభక్తికి, జ్ఞానమునకు, చమత్కారోక్తికి యముఁడు మెచ్చెను. ఆమె వాక్యములం దీయర్థమును మీరు కనిపెట్టవలయును.

సావిత్రి, దమయంతి, చంద్రమతి, సీతాదేవి లోనగు నుత్తమస్త్రీలందఱు పాఠశాలలకుఁ బోయి చదివినవారు గారు. పూర్వము ప్రతిగృహ మొక్కొక్క పాఠశాలగా నభ్యాసశాలగా నుండెను. గృహస్థుఁడే నీతి మతవిద్యా గురువు. గృహిణియే యుపాధ్యాయురాలు. సాధారణముగా తండ్రియే తన కొడుకులకు కులవిద్య నేర్పును. అప్పుడా యింటనుండు ఆఁడుబిడ్డలును వారితో పాటు నేర్చుకొనుచుండిరి. పూర్వకాలమున నుత్తమ జాతులవారు సంస్కృతముననే సంభాషించుచుండుటచేతను, వర్ణక్రమము మొదలు గృహముననే నేర్పఁబడుచుండుట చేతను ఒక యింటియందుండువారంద[illegible]

సంస్కృతవిద్య నేర్చినవారుగానే యుండిరి. శాస్త్రములు పురాణములు ఆ భాషయందే యుండుటచేత బాలికలును వానిని గ్రహించుట సుకరమైయుండెను. అట్లు నేర్చిన గ్రంథములలోని విషయము గ్రంథములందే యుంచక ఆచరణములోనికి వచ్చునట్లు పెద్దవారు కనిపెట్టుచుండిరి. ఇప్పుడు పాఠశాలలయందుఁ దమబిడ్డ లేమి చదువుచున్నారో తల్లిదండ్రులకుఁ దెలియదు. తెలిసినను వారు చదువునది యాయాంకుల నీతి మతాచారములకు సంబంధించినది గాదు గనుక నేమియుఁ జెప్పలేక మా బిడ్డలు బడికి పోయివచ్చుచున్నారని మాత్రము సంతోషించుచున్నారు.

సత్యము చెప్పుము అని గ్రంథములం
దుఁ జదివి బాలుఁడో బాలికయో యసత్య
మాడిన "ఇదా నీవు చదివిన చదువు"
అని ఆక్షేపింపఁబడుచుండిరి. అట్టులే
ఆచారవిషయము చదివి దానికి విరుద్ధముగ
నడచిన బాలురు దండింపఁబడుచుండిరి.
ఒకశబ్దము సాధురూపము పుస్తకమునఁ
జదివి మాటలాడునపుడు అసాధురూపము
ప్రయోగించిన పరిహసింపఁ బడుచుండిరి.
ఈవిధముగా బాలురకు అధ్యయనము
ఆచరణము సమముగా వర్తించుచుండెను.
ఇట్టులే బాలికలును శాస్త్రములోని విష
యములను వినికిచేతను తల్లిదండ్రులబోధ
చేతను నేర్చుకొని సత్ప్రవర్తనము గలిగి

పుట్టినయింటికిని మెట్టినయింటికిని కీర్తిప్రతి
ష్ఠలు తెచ్చుచుండిరి. విద్యవలన సాధింప
వలసిన ముఖ్యవిషయము జ్ఞానము. అది
చదువను వ్రాయను రాకపోయినను మీఁ
దచెప్పిన పద్ధతులచొప్పున నైన సంపాదింప
వచ్చును. కావుననే సీతాదేవి, సావిత్రి
లోనగు ఆర్యస్త్రీలు జ్ఞానవతులని గ్రంథ
ములఁ గొనియాడఁబడిరి గాని చదువను
వ్రాయను వచ్చినవారని మెచ్చుకొనఁబడిన
వారుగారు. జ్ఞానములేని విద్య ప్రాణము
లేని దేహము సమానములు.

ఇంటఁ జదువు చెప్పుటకు వలనుపడని
తల్లిదండ్రులు కుమారులను వేఱొకగురువు
నొద్దకుఁబంపుచుండిరి. ఆగురువులును జీత

ము బత్తెము గైకొనక తామే శిష్యులకు అన్నముపెట్టి విద్య నేర్పుచుండిరి. అన్నముపెట్టుశక్తి గురువునకు లేనపుడు మధుకరవృత్తిచే శిష్యులు జీవించుచు విద్య నేర్చుకొనుచుండిరి.

క. "అతిరోషుండయి శాంత
స్థితికి, మదిం గపటమూఁది చెలిమికి, సుఖసం
గతుఁడై విద్యకుఁ, బరుష
వ్రతుఁడై యంగనకు నాసపడఁ జనదెందున్."

అను నీతి ననుసరించి సుఖము నాశించువాఁడు చదువునందుఁ గుశలుఁడు కాలేఁడు గనుక శిష్యులు శుశ్రూషాది కార్యములు చేసి కష్టించి విద్యగ్రహించుచుండిరి. ఇట్లు చేయువారు బాలురేగాని బాలికలుగారు.

బాలిక లెప్పుడు నింటనుండువారే. ఇంటనుండియే కులస్త్రీలకుఁ గావలసిన ఉత్తమాచార-జ్ఞానములను బాలికలు సంపాదించుచుండిరి. పరపురుషగోష్ఠి శీలహానికి కారణమగుననియు అసమానులతోఁ గలసిమెలసి యుండుట తేజోహానికి గారణ మగుననియు నెంచి తల్లిదండ్రులు పుత్రికలను విచ్చలవిడి దిరుగనిచ్చినవారు గాక శుభోదర్కమైన విషయములనే వారికి బోధించుచుండుటచే క్షుద్రవిషయములకు బాలికల మనస్సున నెడములేకుండెను. ఈవిధముగఁ బెరిఁగిన వారగుటచేత సావిత్రి, సీత, దమయంతి, చంద్రమతి లోనగు వేనవేలు పూర్వస్త్రీలు అంతటి గొప్పవా

నైరి. ఆపద్ధతు లున్నచోట నట్టిస్త్రీలే పుట్టుదురు. కొన్ని దృష్టాంతములు చెప్పెదను.

రత్నఖేటుఁ డను నొక గొప్పపండితుఁ డుండెను. ఆయన కొమార్తె యొకనాఁ డుదయమున వాకిట పేఁడనీళ్లు చల్లుచుండు సమయమున నొక పండితుఁడు వచ్చి "అమ్మాయీ! రత్నఖేట దీక్షితులవారున్నారా" యని యడిగెను. ఏల యని యాబిడ్డ ప్రశ్నించెను. శాస్త్రవాదమునకై వచ్చియున్నాను. అని చెప్పఁగా ఆ చిన్నది నవ్వి కలయంపి చల్లుచునే యామట్టునకు సరిపోవునట్లు ఆశువుగా

శ్లో. విపశ్చితా మపశ్చిమే నివాసకేళినిశ్చితే
సపత్నిజి ద్వయత్న తస్తు రత్నఖేటదీక్షితే

బృహస్పతిః క్వజల్పతి ప్రసర్పతి క్వసర్పరా
డసమ్ముఖశ్చ షణ్ముఖ శ్చతుర్ముఖ శ్చ దుర్ముఖః.

అను శ్లోకము చెప్పెను. అనఁగా నా తండ్రిగారగు రత్నఖేటదీక్షితులు ప్రతివాదుల నప్రయత్నముగనే గెలుతురు. ఆయన ముందర బృహస్పతి నోరు తెఱవలేఁడు. శేషుఁడు నిలువలేఁడు. షణ్ముఖుఁడు మొగము ప్రేలవేసికొని పోవును. బ్రహ్మయును మాఱుమోము పెట్టును అని అర్థగాంభీర్యము అర్థయుక్తము లైన మాటలు గలట్టు చెప్పెను. ఆమె ప్రజ్ఞకే శ్రోత్రపండితుఁడు భయపడి రత్నఖేటునితో వాదింపకయే వెడలిపోయెను.

లీలావతి తండ్రివలననే గణితశాస్త్రము

నేర్చెను. పెద్దిభట్టు ఆయనమఱదలు వ్యాకరణసూత్రములతోనే యొకరినొకరు పరిహాసము చేయుచుండిరి.

ఒకగృహస్థున కొకకూఁతు రుండెను. దానిని ఆవీథిలోనే యుండు మఱియొక బాలున కిచ్చి వివాహముచేయ నుద్దేశింపఁగా తండ్రిని చూచి యాకన్య

"యస్య షష్ఠీ చతుర్థీ చ
విహస్య చ విహాయ చ
అహం కథం ద్వితీయా స్యాత్
ద్వితీయా స్యా మ్యహం కథమ్."

విభక్తిజ్ఞానము శబ్దస్వరూపము తెలియని యాబాలుని తాను వివాహమాడనని చెప్పెనఁట.

తరిగొండ వెంగమ్మ కవిత్వము యోగముకూడ నెఱిఁగి యుండెను.

సంస్కృతమున గొప్ప పండితులు కవులనఁగు దండి కాళిదాసులు నేను కవిని నేను కవిని అని కలహించి పరీక్షార్థము దేశసంచారము చేయఁబోయి యొకయింట దిగిరి. భోజనానంతరము తాంబూలము వేసికొనునపుడు ఆయిరువురిలో నొకరికి ఆకులు నొకరికి సున్నము కావలసి ఆగృహస్థుని పుత్రికను బిలిచి

"చూర్ణమానీయతాంతూర్ణం పూర్ణచంద్రనిభాననే"

అని సున్నము కావలసినవాఁడు చెప్పఁగా,

పర్ణాని స్వర్ణవర్ణాని కర్ణాంతాయత లోచనే

యని ఆకులు కావలసినవాఁడు చెప్పెను. ఆ బాలికయు "కవయే కాళిదాసాయ దండినే పండితాయచ" యని చెప్పుచు వాని నిచ్చెనఁట. ఇప్పటి విదుషులలో పెక్కురు పూర్వాచారము ననుసరించి విద్య నేర్చి జ్ఞానము సంపాదించినవారే. వీరంద ఱే పాఠశాలలయందుఁ జదివిరి? ఆధునిక పద్ధతుల ప్రకారము నేర్చినవారిలో పెక్కురకు జ్ఞానము తక్కువ మోహము మెక్కువ. దానికి దృష్టాంతము లెన్నియో కలవు.

అనేక కారణముల చేత నిప్పుడు మునుపటి పద్ధతులు పోయినవి. వానితో ఆ

గుణములును పోయినవి. విద్యవలని లాభము ఉద్యోగ మని యిప్పటి తల్లిదండ్రుల యభిప్రాయము. అట్టి యుద్యోగము సంపాదింపఁ జేయు విద్యయే పరమార్థముగ నెంచి తల్లిదండ్రులు తమ బిడ్డలకు కులవిద్య చెప్పుటయే విడిచిరి. మేము చిన్నవాండ్రుగ నుండునపుడును మా తల్లిదండ్రులు మాకు నీతి మతాచారముల గుఱించి యెన్నికథలో చెప్పుచుండిరి. ఇప్పుడు చెప్పువాఁడు లేఁడు. వినువాఁడును లేఁడు. మీరు పాఠశాలలకు పోయి చదువుచదువును గుఱించి నేను జెప్పనేల? నాలుగక్షరములు వచ్చినంతనే తమకుఁ జదువు వచ్చినదని వీధియందుఁ బోవు నలువురికి

తెలియవలయునని యొక పుస్తకము చేత నుంచుకొని కిటికీల కెదురుగ కుర్చీలపైఁ గూర్చుండి కాళ్లు పాఱఁజాఁచి యొకకన్ను వీథిమీఁద నొక కన్ను పుస్తకముమీఁద నుంచి పెదవులు కదలించుట, విద్యావతుల మని భ్రమించి గర్వించుట, గృహకృత్యములు చేయకుండుట, పెద్దవారల నలక్ష్యభావమునఁ జూచుట, స్త్రీలు వీథుల వెంటఁ బోవునపుడు చెప్పులు తొడుగుకొన వలయునా? చెడావులు తొడుగుకొనవలయునా? ముచ్చెలు వేసికొనవలయునా? మేజోళ్లు ధరింపవలయునా? యని సభలయందు చర్చించి తీర్మానించి లోకోద్ధారక కార్యము నిర్వహించినట్టు పత్రికలలో

ప్రకటించుట లోనైనవి యిప్పటి మా విద్యకు పరమఫలములైయున్నవి. ఇట్టి దురవస్థ మన దేశమునందే కాదు. బంగాళా దేశమునం దిట్టి గతియే కలిగినదని ముజుందార్ అను నాయన వ్రాసియున్నాఁడు. అల్పవిద్య అనర్థకారి కదా?

ఉ. "తెలివి యొకింతలేనియెడఁ దృప్తుఁడనై కరిభంగి
సర్వముం | దెలిసితి నంచు గర్వితమతిన్ విహరిం
చితిఁ దొల్లి; యిప్పుడు | జ్జ్వలమతులైన పండి
తులసన్నిధి నించుక బోధశాలినై | తెలియనివాఁడ
నై మెలఁగితిన్ గత మయ్యె నితాంతగర్వమున్."

అన్నట్లు సంపూర్ణమైనవిద్య వచ్చినవారియందే దుశ్చేష్టలు గానరావు. నీతిమతాచారబోధకమైనవిద్య కొఱకేమము

నేర్చినను గర్వమును గలిగింపక వినయమును శీలమును గలిగించును. మీాక్షేమము దేశకీర్తి కోరినవారైనయెడ మీాతల్లిదండ్రులును పూర్వు లెట్టి యాచారవ్యవహారములచే నెట్టి ఘనకార్యములు చేయఁగలిగిరో యవి మీాకు తెలిపి మిమ్ముఁ గొంతకుఁ గొంతైన చక్కఁబఱుతురు. స్త్రీలు నేర్చు విద్య యుత్తమకులస్త్రీ సముచితమ్ములైన గుణములు-ఆచారములు-నీతులు-స్వమతమును చెఱుచునవిగా నుండరాదు. ఎట్టివారియొద్దకు తమపిల్లలను విద్య నేర్పుటకై పంపవచ్చును యెట్టివారియొద్దకు పిల్లలను పంపరాదు అని పెద్దవా రాలోచింపవలయును. చక్కని నడవడిలేని నీచురాలి యొద్దకు

విద్య నేర్చుకొన పిల్లలను పంపిన నది తన యంతవారిని జేయును. విరుద్ధమతబోధకుల యొద్దకు పంపిన మనమతమును దూషించి వారిమతమునే వారు బోధింతురు. మదనపల్లెయందొక గృహస్థు ఏడు సంవత్సరముల తన బిడ్డను సమీాపమున నున్నదను కారణమున వేఱుమతమును బోధించు పాఠశాలకు పంపుచుండెను. ఆపిల్ల యింటికివచ్చి అమ్మా నీమొగాన కుంకుమేల పెట్టుకొనెదవే? బొమ్మలను చెట్లను ఏల పూజించి వానిచుట్టు తిరిగెదవే యని యేమేమో యాక్షేపించుచుండెను. తల్లిదండ్రులు బుద్ధిమంతులై యాపిల్లను మఱియొక పాఠశాలకు పంపిరి. నోరెఱుఁగని

పిల్లవాండ్రను స్వవిరుద్ధ మతబోధకుల చేతి లోఁబెట్టి వెనుక దుఃఖించువారికంటె మతి హీనులుందురా? చదివించుటకు రాజకీయ జాతీయ పాఠశాలలు లేవా?

సహవాసమువలననే గుణములు లభించును. సహవాసమువలననే దుర్గుణములు పట్టుబడును. కావున తమ పిల్లవాండ్రెట్టి వారితోఁ సహవాసముచేయుచున్నారో కనిపెట్టవలసినది పెద్దవారికి విధి.

ఒక పాఠశాలకు పిల్లలనుగాని పిల్లవాండ్రనుగాని పంపునపుడు అక్కడ నేర్పఁబడు విద్య నీతి మతము ఆచార మెట్టిదో పెద్దవారు తెలిసికొనవలయును. అక్కడ కూడు సంపాదించుకొను విద్యమాత్రమే

నేర్పఁబడునేని తామింట జ్ఞానము కలిగించు విషయములను జాతీయపద్ధతులను నేర్పవలయును. అచ్చట విరుద్ధమతములు బోధింపఁబడునేని యచటికి బాలురను బాలికలను బంపకుండుట శ్రేయస్కరము. విధిలేక పంపవలసివచ్చెనా యింట మన మతవిషయములు వారికి నెక్కువ శ్రద్ధతోఁ దెలుపుచుండవలయును. మన బాలురకు బాలికలకు మన నీతి మతాచారములు చక్కఁగ తెలిసియుండెనేని దానికి భిన్నముగ నెవరైన దుర్మతముల బోధించినను వారు తెలియక చెప్పుచున్నారని వారి మాటల లక్ష్యపెట్టకుందురు. రాజకీయ జాతీయ పాఠశాలలయందు నీతి బోధింపఁబడునుగనుక బాలురు చెడరు.

సంసార శకటమునకు భార్యాభర్తలు చక్రవృషభములు. వృషభము భర్త. చక్రము భార్య. వృషభము తాను చక్కఁగ బండి లాగుటకు కావలసిన శక్తియు నడవడియు సంపాదించుకొనవలయును. చక్రము వృషభమునకు తోడుపడునదియై దానికి భారము తోఁపకుండునట్లు సులభముగ బండికదలునట్లు తిరుగుచుండవలెను. అటులే భార్యాభర్తలును. అటుగాక యెద్దును గట్టవలసిన చోట చక్రమునుంచి చక్రము మాఱు ఎద్దునుంచిన బండి యెట్లగునో చూడుఁడు. అటుగాక యెద్దును చక్రమును ఒక కార్యమున నే యుంచిన నప్పుడెట్లుండునో చూడుఁడు. బాలలకు ముఖ్యముగ

ఇల్లు దిద్దుకొను తెలివియు పరలోకమునకుపయోగపడు జ్ఞానము కలుగఁ జేయవలసినది పెద్దవారికి విధి. ఇప్పటి కొందఱు బాలికలకు ఈ రెండును సర్వమంగళము. ఏల యందురా బడులకు పోయి చదువుట వలన నింట వంట పని చేయ నేర్చుకొను విరామము లేదు. బడులలో చదువు చదువా గాడిదకు నాలుగుకాళ్లు. కుక్కతోఁక వెనుకప్రక్క నుండును "ఏనుఁగు భూమికి ఆఱడుగుల యెత్తుననుండును" అనునట్టిదై యుండును. ఇఁక గృహకృత్యములు పాట పద్యములు ఆచారములు లోనైనవి నేర్చుకొనుటెక్కడ? జ్ఞానము సంపాదించుటెక్కడ? ఎన్నివిద్యలైన నేరువవచ్చునుగాని

స్వకులజాతివిద్యలను, నీతి సుతాచారము
లను విడనాడరాదు.

రుక్మిణి—అప్పా! శాస్త్రవిషయము సావి
త్రికి తల్లిదండ్రులు నేర్పి రనుకొనినను
యముని జూచునట్టి శక్తి యెట్లువ
చ్చెను?

తండ్రి—తపస్సుచేత పాతివ్రత్యముచేత.

రుక్మిణి—ఆడువారి కేమి తపస్సు?

తండ్రి—తపస్సు అనగా ఉక్కిరి బిక్కిరిగ
ముక్కులు బిగించుకొని తికమకలాడుట
గాదు. తపస్సు మూడు విధములు.
శారీరతపస్సు. వాగ్రూపకమైన తప
స్సు మానస తపస్సు అని.
దేవతలను, సద్బ్రాహ్మణులను, గురువు

లను (తల్లి, తండ్రి, భర్త, ఆచార్యుడు
వీరికి గురువులని పేరు) జ్ఞానవంతులను పూ
జించుట, పరిశుద్ధమైన నీటియందు విధి
యుక్తముగ స్నానముచేయుట, దేహమున
ముటికి లేక యుంచుకొనుట, నిర్మలమన
స్సున నున్నట్లె నడనడియందుండుట, పురు
షులు పరస్త్రీలను స్త్రీలు పరపురుషులను రా
గాసక్తిగల బుద్ధితో చూడకుండుట, ప్రాణ
ముగల వానికి బాధకలుగ జేయకుండుట
ఇవి శరీరముతో జేయుకార్యములు కా
వున శారీర తపస్సు అనబడును.

సత్యము, ఇష్టము, హితము, ఇతరు
లకు దుఃఖము కలిగింపనిది యగుమాట
చెప్పుట, ఇవి వాగ్రూపకమైన తపస్సు.

వేదాధ్యయనము జపము దీనియందుఁ జేరుచున్నవి.

చెడుకోరికలు కోపము లోనైనవి లేక మనస్సు నిర్మలముగ నుంచుకొనుట, ఇతరుల మేలుగోరుట, మితముగ భాషించుట, ధ్యానము చేయఁదగిన విషయమందు మనస్సును నిలుపుట, ఆత్మకంటె నితరములైన విషయములందు మనస్సు పోనీకుండుట మానసతపస్సు అనఁబడును.

ఈమూఁడు తపస్సులు ఒకరిని మోసగించుటకుఁ గాని ఇతరులు తన్ను పొగడుటకుఁ గాని చేయరాదు. నేనిటుచేసిన నాకీఫలము కావలయునని కోరరాదు. ఇది భగవంతుని ఆరాధించువిధమని భక్తితో

చేయవలయును. ఇటుచేయువారికి యముఁడనేల భగవంతుఁడే ప్రత్యక్షమగును.

ఇట్టి తపస్సుచేసిన వారగుటచేతనే చంద్రమతి, శకుంతల, దమయంతి, సీతాదేవి ద్రౌపది, సావిత్రి, లోనగు స్త్రీలు ఒకరిని శపించుటకు; తమ భర్తలకు వచ్చిన ఆపదఁ బాపుటకు, తమభర్తలచేత తమకు కీడుచేసిన వారిని చంపించుటకు శక్తిగలవారైరి.

రుక్మిణి—అప్పా! సీతాదేవి ద్రౌపది విషయములో నీవుచెప్పినది తప్పు. శ్రీరాముఁడు రావణాసురుని చంపినది సీతామాహాత్మ్యమువలననా? పాండవులు కౌరవులనుచంపినది ద్రౌపదీమాహాత్మ్యమువలననా? కాదుగదా.

తండ్రి —— కాదని నీ కెవరు చెప్పిరి? రామా
యణకథ నీకు తెలిసియుండిన నీవిట్లు
చెప్పవు. భూభారమును బాపఁబుట్టిన
శ్రీకృష్ణుఁడు అశ్వత్థామవాతఁబడ
కుండ పాండవపుత్రుని కాపాడుట ద్రౌ
పదిమంగళసూత్రమును రక్షించుటకు
గాని యితరము కాదు అని పెద్ద లం
దురు.

రుక్మిణి —— అప్పా! నీవు చెప్పునది వింతగా
నున్నది. అయినను నీవు అబద్ధము
చెప్పినట్లు నేను తలఁపను. ముందు రా
మాయణకథ తెలిపి తరువాత భారత
కథ తెలుపుము.

తండ్రి —— అవి యొక్కొక్క నాటికి ముగియు

కథలు గావు. మూఁడేసి దినములే
పట్టునో? నాలుగేసి దినములే పట్టునో?

రుక్మిణి —— ఎన్నిదినములైన పట్టనీ! కట్ట
కొట్టకు తెచ్చె అని చెప్పిన ప్రయోజన
మేమి? వానిలో నుండు సారమంతయు
మాకు తెలియఁజెప్పవలయును.

తండ్రి —— సరి. రేపటినుండి శ్రీసీతాచరిత్రము
చెప్పెదను. శ్రీసీతారాములపట
మును మీరు పూలతో అలంకరించి యి
క్కడ నుంచవలెను. శ్రీరాములు పుట్టి
నప్పుడును సీతాకల్యాణమప్పుడును కా
లసి వచ్చునప్పుడు గనుక కలుంకాయలు తాం
బూలము గంధము పసుపు కుంకుమము
వాసనవత్తులు కూడ తేవలయును.

రాముఁడు—అది యంతయు నాఁడుపిల్లల పని.

అమ్మణ్ణి—పోరా నాపాటురామా! మేము చేయకుండిన నీవు చేసెద వని తలఁచి యుంటిమా. నేను రుక్మిణి చేసెదము లే.

(క్రొ. వేం. ప.)

ఈ పుస్తకమున వచ్చు స్త్రీ పురుషుల నామములు.

పురుషులు

అశ్వపతి—మద్రదేశపు రాజు. సావిత్రి తండ్రి.

నారదుఁడు—దేవముని.

యముఁడు—దక్షిణదిక్కున కధిపతి. కాలముతీఱిన జీవులఁ జంపువాఁడు. శ్యామలాదేవి మగఁడు. సూర్యుని కొడుకు. శనైశ్చరుని తోఁడఁబుట్టినవాఁడు.

ద్యుమత్సేనుఁడు— సాల్వదేశపు రాజు. సత్యవంతుని తండ్రి.

సత్యవంతుఁడు—ద్యుమత్సేనుని కొడుకు. సావిత్రి పెనిమిటి. ఈయనకుచిత్రాశ్వుఁడని మఱియొక పేరు.

స్త్రీలు.

సావిత్రీ దేవి—బ్రహ్మభార్య. ఈమె ఉదయమున గాయత్రియనియు మధ్యాహ్నమున సావిత్రియనియు సాయంకాలమున సరస్వతియనియుఁ బేర్లు.

సావిత్రి—అశ్వపతికూఁతురు. సత్యవంతుని భార్య. యముని మెప్పించి భర్తను బ్రదికించుకొన్న పతివ్రత.

మాళవి—సావిత్రితల్లి.

శైబ్య—సత్యవంతుని తల్లి.

అర్థములు.

2. ఉగ్గడించి = చెప్పి.

5. తొడఁగెను = ప్రారంభించెను.

5. బ్రహ్మణ్యుఁడు = వేదము లెఱిఁగినవాఁడు.

6. జానపదులు = పల్లెలయందుండువారు.

,, ఋక్కు = మంత్రము.

10. అంతర్హిత = కానరానిది.

11. జవసత్త్వములు = త్వర, బలము.

20. మతిమతి = బుద్ధిమంతురాలు.

23. దేశాటనము = దేశసంచారము.

24. సచివులు = మంత్రులు.

,, యథావిధి = శాస్త్రము ప్రకారము.

25. అతిలోకము = లోకము నతిక్రమించినది.

27. అంధుఁడు = గ్రుడ్డివాఁడు.

,, బాలవత్సల = పిల్లవానియందుఁ బ్రీతి గలది.

,, చీఁకురాజు = గ్రుడ్డిరాజు.

29. హ్రీమంతుఁడు = లజ్జగలవాఁడు.

,, ఆర్జవము = చక్కని నడవడి.

30. త్రికాలవేదులు = జరగినది జరగుచున్నది జరగఁబోవునది తెలిసినవారు.

31. అమోఘవచనులు = వ్యర్థముగాని మాటలుగలవారు.

36. అనిష్టము = కీడు.

40. ప్రోక = రాశి.

44. కులీనుఁడు = మంచికులమునఁ బుట్టినవాఁడు.

45. విగతరాజ్యులు = పోయిన రాజ్యము గలవారు = రాజ్యభ్రష్టులు.

45. విపినము = అడవి.

49. చిరకాలేప్సితము = దీర్ఘకాలముగ కోరినది.

58. మహాభాగ = మిక్కిలి యదృష్టవంతురాలు.

58. శుష్కోపవాసము = నీరుకూడ త్రాగక పస్తుండుట.

59. సుకరము = చేయసులభమైనది.

85. వపుష్మంతుఁడు = మంచిదేహపుష్టిగలవాఁడు.

,, శ్యామగాత్రుఁడు = నల్లనిదేహముకలవాఁడు.

88. ఔర్ధ్వదైహికములు = ఉత్తరక్రియలు.

93. అపహృతము = అపహరింపఁబడినది.

95. వాఙ్మనఃక్రియలకు = వాక్కుచేతను. మనస్సుచేతను కార్యములచేతను.

,, ఎదిరి = ఎదుటనుండువారు; ఇతరులు.

96. తృప్తిఁడు = దప్పిగొన్నవాఁడు.

,, తుషార = మంచు.

,, తోయము = నీళ్లు.

109. నక్తంచరులు = రాత్రియందుఁ దిరుగు వారు రాక్షసులు.

,, ఫేరవము = నక్క.

END OF TITLE